మా కలం - సామాన్యుడి బలం

స్వర్ణసాగరం

జాతీయ తెలుగు దినపత్రిక



Dr. DAMA VIJAYKUMAR B.A., LLB
EDITOR
SWARNA SAGARAM TELUGU DAILY

AP State General Secretary
MALAMAHANADU

AP State Joint Secretary
National Consumer Right Commission

Founder & Chairman
Swarna Sagaram Foundation

9440352036
9666038944

vkdvijay09@gmail.com



మా కలం - సామాన్యుడి బలం

# స్వర్ణసాగరం

www.swarnasagaram.in జాతీయ తెలుగు దినపత్రిక

ఆంధ్రప్రదేశ్ తెలంగాణ | సంపుటి : 6 | సంచిక : 105 | పేజీలు : 8 | ఎడిటర్ : డా.దామా విజయ్‌కుమార్ | ఆదివారం 13 ఏప్రిల్ 2025 | వెల : 2-00


## ఇంటర్‌లో భారీగా
# పెరిగిన ఉత్తీర్ణత



- ద్వితీయ సంవత్సరంలో 83 శాతం మంది
- ప్రథమ సంవత్సరంలో 70% మంది పాస్
- గత పదేళ్లతో పోలిస్తే ఈ ఏడాదే అత్యధికం
- టాప్‌లో కృష్ణా... అట్టడుగున అల్లూరి జిల్లా
- రెండు సంవత్సరాల్లోనూ బాలికలదే పైచేయి
- సత్తా చాటిన ప్రభుత్వ జూనియర్ కాలేజీలు



## అది రోడ్డు ప్రమాదమే

- పాస్టర్ ప్రవీణ్ మృతిపై పోలీసుల స్పష్టీకరణ
- ప్రమాద సమయంలో పనిచేయని బుల్లెట్ హెడ్‌లైట్..
- హైవే పక్కన కంకరపైకి వెళ్లడంతో స్కిడ్ అయిన బైకు
- ఆయనపై పడిన బుల్లెట్
- ఏ వాహనమూ ఢీ కొట్టలేదు
- 100 మందిని విచారించాం
- 400 సీసీ ఫుటేజీల పరిశీలన
- దర్యాప్తుపై ప్రవీణ్ కుటుంబ సభ్యులకు నమ్మకం
- ఏలూరు ఐజీ అశోక్ వెల్లడి



## ఉపప్రధానిగా
## నితీశ్ కుమార్

- ఎన్డీయేకు నితీశ్ చేసిన సేవలు వెలకట్టలేనివన్న అశ్విని కుమార్ చౌబే
- సంకీర్ణ ప్రభుత్వంలో ఆయన కీలక పాత్ర పోషిస్తున్నారని వ్యాఖ్య
- ఆయన సేవలను గుర్తించి పదవి ఇవ్వాలని వ్యాఖ్య

## జమిలి ఎన్నికలతో
# సుస్థిర పాలన

- ఎందుకు వ్యతిరేకిస్తున్నారో అర్థం కావడంలేదు: వెంకయ్య

**స్వర్ణసాగరం తిరుపతి**

'ఐదేళ్ల పాటు ఏదో ఒక ఎన్నికల గురించి వ్యూహాలు పన్నుకుంటూ, ఎన్నికల మూడ్‌లోనే ఉంటే అభివృద్ధి ఎలా సాధ్యమవుతుంది. ఒకసారి గెలిస్తే ఐదేళు స్థిరంగా ఉండి, అభివృద్ధి చేస్తామన్న భరోసా కూడా రాజకీయ పార్టీలకు వస్తుంది. అప్పుడే గట్టి నిర్ణయాలు తీసుకోగలుగుతారు. జమిలి ఎన్నికలతోనే ఇది సాధ్యమవుతుంది' అని మాజీ ఉపరాష్ట్రపతి ఎం వెంకయ్యనాయుడు అన్నారు. 'ఒకే దేశం-ఒకే ఎన్నిక' ప్రాముఖ్యత, సవాళ్లు, ప్రభావం వంటి అంశాలపై శనివారం ఉదయం తిరుపతిలో నిర్వహించిన సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. జమిలి ఎన్నికల గురించి సుదీర్ఘంగా ప్రసంగించారు. ఏకకాల ఎన్నికలు మనకు కొత్తేమీ కాదన్నారు. 1952, 1957, 1962, 1967 సంవత్సరాల్లో పార్లమెంటు, అసెంబ్లీలకు ఒకేసారి ఎన్నికలు జరిగాయని గుర్తుచేశారు. ప్రస్తుతం రాజకీయ కారణాల వల్లే కొన్ని పార్టీలు జమిలి ఎన్నికలను వ్యతిరేకిస్తున్నాయన్నారు. సగటు భారతీయ ఓటరు తెలివి, వివేచనను తక్కువ అంచనా వేయవద్దని పార్టీలకు విజ్ఞప్తి చేశారు.జమిలి ఎన్నికలతో సమయం మిగులుతుందని, ఖర్చు తగ్గుతుందని,




మిగిలిన నిధులను సంక్షేమం, అభివృద్ధికి వినియోగించవచ్చని చెప్పారు. కాగా, పార్టీ ఫిరాయింపుల చట్టాన్ని పూర్తిగా మార్చాలని వెంకయ్య కోరారు. ఏ పార్టీ తరఫున ఎన్నికయ్యారో ఆ పార్టీ నచ్చకపోతే పదవికి కూడా రాజీనామా చేసేలా చట్ట సవరణ చేయాలన్నారు. విద్య, వైద్య సౌకర్యాలు మినహా ఏది ఉచితంగా ఇస్తామని చెప్పినా, ఎవరు చెప్పినా అది అనుచితమేనని అన్నారు.




- 40 బంతుల్లోనే శతకం
- 246 పరుగులను ఛేదించిన సన్‌రైజర్స్
- పంజాబ్‌కు షాక్
- అభిషేక్ శర్మ (141) (55 బంతుల్లో 14 ఫోర్లు, 10 సిక్సర్లతో)
- సెంచరీ అనంతరం 'ఇది ఆరెంజ్ ఆర్మీ కోసం'

అంటూ రాసిన కాగితాన్ని చూపిస్తున్న అభిషేక్

**స్వర్ణసాగరం హైదరాబాద్:**

ఇదీ సన్‌రైజర్స్ సత్తా.. అంటూ ఓపెనర్ అభిషేక్ శర్మ (55 బంతుల్లో 14 ఫోర్లు, 10 సిక్సర్లతో 141) ఆకాశమే హద్దుగా చెలరేగాడు. రికార్డులను తిరగరాస్తూ సాగిన అతడి విధ్వంసానికి ఉప్పల్ స్టేడియం ఊగిపోయింది. కొడితే సిక్సర్ లేదంటే ఫోర్ అనే మాదిరిగా సాగిన బాదుడుకు, పంజాబ్ కింగ్స్ సాధించిన భారీ స్కోరు కూడా చిన్నబోయింది. దీంతో వరుసగా నాలుగు ఓటములకు చెక్ పెడుతూ రైజర్స్ 8 వికెట్ల తేడాతో ఘనవిజయం అందుకుంది. శనివారం జరిగిన ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్‌కు దిగిన పంజాబ్ 20 ఓవర్లలో 6 వికెట్లకు 245 పరుగులు చేసింది. శ్రేయాస్ (82), ప్రభ్‌సిమ్రన్ (42), ప్రియాన్ష్ (34), స్టొయినిస్ (34 నాటౌట్) వేగం కనబర్చారు. - మిగతా2లో

## కొమ్మా రెమ్మా కన్నీరు..



- గుండెపోటుతో వనజీవి రామయ్య కన్నుమూత
- కోటికిపైగా మొక్కలు నాటి దేశ విదేశాల్లో ఖ్యాతి

**స్వర్ణసాగరం అమరావతి, హైదరాబాద్**

అశోకుడు మొక్కలు నాటించాడనే సంగతి పుస్తకాలకే ఎందుకు పరిమితమవ్వాలి? ఆ చొరవను మనం ఆచరణలోనూ చూపలేమా? అనే గొప్ప సామాజిక స్పృహ ఆయనది! బొమ్మలతో ఆడుకునే ఐదేళ్ల ప్రాయంలో పచ్చదనం మీద ప్రేమతో మొక్కలు నాటారాయన! మొక్కలు నాటేందుకు ఖర్చుల కోసం కొంతభూమిని అమ్మేందుకూ వెనుకాడలేదాయన! పుటుక నీది..

# రాష్ట్రపతికీ గడువు

- గవర్నర్ పంపే బిల్లులపై 3 నెలల్లోగా నిర్ణయం తీసుకోవాలి: సుప్రీం కోర్టు
- దేశచరిత్రలో తొలిసారి రాష్ట్రపతికి గడువు నిర్దేశించిన సర్వోన్నత న్యాయస్థానం
- జాప్యమైతే కారణాలు రాష్ట్ర ప్రభుత్వాలకు తెలపాలి
- గవర్నర్లకే కాదు రాష్ట్రపతికి కూడా
- సంపూర్ణ వీటో అధికారం ఎంతమాత్రం లేదు
- బిల్లులో రాజ్యాంగ విరుద్ధ అంశాలున్నట్టు భావిస్తే
- 'సుప్రీం'కు పంపి సలహా తీసుకోవాలి
- శ్రీలంకలో ఇదే విధానం అమలులో ఉంది
- గడువులోగా రాష్ట్రపతి నిర్ణయం తీసుకోకపోతే..
- రాష్ట్ర ప్రభుత్వాలు కోర్టుల్ని ఆశ్రయించవచ్చు



**స్వర్ణసాగరం న్యూఢిల్లీ**

గవర్నర్లు పంపే బిల్లులపై మూడు నెలల్లోగా నిర్ణయం తీసుకోవాలంటూ సాక్షాత్తూ రాష్ట్రపతికి గడువు నిర్దేశిస్తూ సుప్రీంకోర్టు సంచలన తీర్పునిచ్చింది. అంతకుమించి ఆలస్యమైతే.. జాప్యానికి సహేతుక కారణాలను సైతం నమోదు చేసి, సంబంధిత రాష్ట్రాలకు ఆ విషయాన్ని తెలపాలని జస్టిస్ జేబీ పార్దీవాలా, జస్టిస్ మహదేవన్‌తో కూడిన ద్విసభ్య ధర్మాసనం తన తీర్పులో పేర్కొంది. ఒక వేళ.. ఏదైనా బిల్లు రాజ్యాంగవిరుద్ధంగా ఉందని రాష్ట్రపతి భావిస్తే, ముందుజాగ్రత్త చర్యల్లో భాగంగా దానిపై సుప్రీం కోర్టు సలహా తీసుకోవచ్చని సూచించింది. అలాగే.. గవర్నర్లు పంపే బిల్లులపై నిర్దేశిత గడువులోగా ప్రెసిడెంట్ ఏ చర్యా తీసుకోకపోతే, రాష్ట్ర ప్రభుత్వాలు కోర్టులను ఆశ్రయించి, రాష్ట్రపతికి వ్యతిరేకంగా రిట్ ఆఫ్ మాండమస్ జారీ చేయాల్సిందిగా కోరుతూ రిట్‌పిటిషన్లు దాఖలు చేయొచ్చని పేర్కొంది. అదే సమయంలో.. గవర్నర్లు పంపే బిల్లులపై రాజ్యాంగంలోని 201వ అధికరణ ప్రకారం రాష్ట్రపతి వ్యవహరించాలని.. రాష్ట్రాలు సైతం కేంద్రం అడిగే ప్రశ్నలకు వేగంగా సమాధానాలు ఇచ్చి సహకరించాలని, కేంద్ర ప్రభుత్వం చేసే సూచనలను పరిగణనలోకి తీసుకోవాలని సూచించింది.దేశ సర్వోన్నత న్యాయస్థానం ఇలా రాష్ట్రపతికి ఒక అంశంలో నిర్ణయం తీసుకోవడానికి గడువును నిర్దేశిస్తూ తీర్పునివ్వడం దేశ చరిత్రలోనే ఇది తొలిసారి. శాసనసభ ఆమోదించి పంపిన బిల్లులపై గవర్నర్ రవి ఏ నిర్ణయమూ తీసుకోకుండా తొక్కిపెడుతున్నారంటూ తమిళనాడు సర్కారు సుప్రీంకోర్టును ఆశ్రయించగా.. - మిగతా2లో

స్వర్ణసాగరం
జాతీయ తెలుగు దినపత్రిక



# అది రోడ్డు ప్రమాదమే



-మొదటిపేజీ తరువాయి

**రాజమహేంద్రవరం**

పాస్టర్ ప్రవీణ్ మృతికి రోడ్డు ప్రమాదమే కారణమని ఏలూరు రేంజ్ ఐజీ జీవీజీ అశోక్‌కుమార్ స్పష్టం చేశారు. ప్రమాద సమయంలో ఆయన వెళ్తున్న బుల్లెట్ హెడ్‌లైట్ పనిచేయలేదని, గంటకు 70 కిలోమీటర్ల వేగంతో పోతున్నారని అంచనా వేశామని తెలిపారు. రాజమహేంద్రవరం సమీపంలో హైవే పక్కన కంకరపైకి బండి వేగంగా వెళ్లడంతో స్కిడ్ అయి అర్ధ చంద్రాకారంలో రోడ్డు కిందకు జారి వర్షపు నీటి డ్రెయిన్‌లో పడిపోయారని ఫోరెన్సిక్ ల్యాబ్ నిపుణులు అభిప్రాయం వ్యక్తం చేశారని వెల్లడించారు. అక్కడున్న రాయి ప్రవీణ్ ముఖానికి బలంగా తగలడంతో గాయమైందని, కిందకు పడిపోయిన క్రమంలో ఆయనపై బుల్లెట్ పడిందని నివేదిక ఇచ్చారని తెలిపారు. ఏ వాహనం కూడా ఢీకొనలేదని వివరించారు. శనివారం తూర్పుగోదావరి జిల్లా పోలీసు కార్యాలయంలో ఆయన మీడియా సమావేశంలో దర్యాప్తు వివరాలను వెల్లడించారు. గతనెల 24న ప్రవీణ్ హైదరాబాద్‌లో బయల్దేరినప్పటి నుంచి రాజమహేంద్రవరం సమీపంలో మృతి చెందిన ఘటన వరకు ముఖ్యమైన సీసీ ఫుటేజీలను ప్రదర్శించి వివరించారు.

**దారిలో ఏం జరిగిందంటే...**

'మార్చి 24 ఉదయం 11 గంటలకు హైదరాబాద్‌లోని తన నివాసం నుంచి ప్రవీణ్ (46) బయలుదేరారు. మార్గమధ్యంలో నాలుగుసార్లు మద్యం కొనుగోలు చేశారు. పెట్రోలు బంకులతో కలిపి ఆరు చోట్ల యూపీఐ ద్వారానే డబ్బులు చెల్లించారు. చిల్లకల్లులోని వెంకటసాయి ఫుడ్ ప్లాజా ఎదురుగా హైవేపై ఒకసారి, కీసర టోల్ గేటుకు 500 మీటర్ల దూరంలో మరోసారి, రామవరప్పాడు రింగ్‌రోడ్ వద్ద మూడోసారి కింద పడిపోయారు. ఈ మూడు ప్రమాదాల్లో ఆయనకు రాపిడి గాయాలయ్యాయి. బైక్ హెడ్‌లైట్ పగిలిపోయింది. రామవరప్పాడు రింగ్ వద్ద పడిపోయిన సమయంలో ఆటో డ్రైవరు చూసి పోలీసులకు చెప్పారు. పోలీసుల సూచనతో పక్కన పార్కులో సుమారు 2గంటలు విశ్రాంతి తీసుకున్నారు. పోలీసులకు తెలియకుండా మళ్లీ బుల్లెట్‌పై బయలుదేరారు. నయారా పెట్రోలు బంకు సమీపంలో రోడ్డు పక్కన ఏడు అడుగుల దిగువున ఉన్న ఎండిపోయిన వర్షపు నీటి డ్రెయిన్‌లో పడిపోయి మృతిచెందారు. ప్రమాదం 24న రాత్రి 11.42 గంటలకు జరిగింది. ప్రవీణ్ వాహనం వెంబడి వెళ్లిన వాహనాలను పరిశీలించాం. ఈ కేసులో సుమారు 100 మందిని విచారించాం. 400సీసీ ఫుటేజీలను పరిశీలించాం. దూరం నుంచి వస్తుండడం, హెడ్‌లైట్ లేకుండా కుడి వైపున సిగ్నల్ లైట్‌తో అజాగ్రత్తగా ప్రయాణించడం వల్ల ప్రమాదం జరిగింది' అని ఐజీ వివరించారు.

**ఇక్కడితో కేసు ముగిస్తున్నాం**

'ప్రవీణ్ బావ శామ్యూల్ వాలెస్ ఫిర్యాదుతో అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించాం. కేసు తీవ్రత దృష్ట్యా అనుభవం గల అధికారులతో సిట్ వేసి 14 రోజుల్లో వేగంగా దర్యాప్తు చేశాం. ప్రవీణ్ కుటుంబ పరువును కాపాడాల్సిన బాధ్యత సమాజంపై కూడా ఉంది. అందువల్ల కొన్ని విషయాలు వెల్లడించలేం. వదంతులు వ్యాప్తిచేసిన 11 మందిపై కేసులు పెట్టి ఒకరిని అరెస్టు కూడా చేశాం. ఈ కేసు దర్యాప్తును ఇక్కడితో ముగిస్తున్నాం. అనుమానాలపై ఎవరి వద్దనైనా ఆధారాలు ఉంటే అందజేసి సహకరించాలని కోరాం. గురువారం వరకు గడువు ఇచ్చినా ఎవరూ ఇవ్వలేదు' అని ఐజీ తెలిపారు.

**హత్య కోణంలోనూ దర్యాప్తు చేశాం**

'ప్రవీణ్‌ను హత్య చేశారని, మృతదేహాన్ని తీసుకొచ్చి పడేశారని అనుమానాలు వ్యక్తం చేసిన వారెవరూ తగిన ఆధారాలు సమర్పించలేదు. ఆ కోణంలోనూ దర్యాప్తు చేశాం. దర్యాప్తుపై ప్రవీణ్ భార్య సహా కుటుంబ సభ్యులు అనుమానాలు వ్యక్తం చేయలేదు. పోలీసులపై వారికి విశ్వాసం ఉంది. సామాజిక మాధ్యమాల ద్వారా ఎవరైనా ఊహాగానాలు, వదంతులు వ్యాప్తి చేయాలని చూస్తే కఠిన చర్యలు తప్పవు' అని ఐజీ హెచ్చరించారు.

**రూ. 2,842 మద్యం కొనుగోలు**

'పాస్టర్ ప్రవీణ్ మార్గమధ్యంలో నాలుగుసార్లు ఆగి మొత్తం రూ.2,842 విలువ చేసే మద్యం కొనుగోలు చేశారు. 24న మధ్యాహ్నం 12.24 గంటలకు హైదరాబాద్ సిటీలోని సవేరా లిక్కర్ మార్ట్‌లో రూ.950 మద్యం కొన్నారు. మధ్యాహ్నం 3.02కు కోదాడలోని శ్రీఆదిత్య వైన్స్‌లో రూ.670, సాయంత్రం 4.56కు విజయవాడ దగ్గర రూ.872, రాత్రి 10.12 గంటలకు ఏలూరులోని నిపన్స్ టానిక్ వైన్స్‌లో రూ.350మద్యం కొన్నారు' అని తెలిపారు.

**బుల్లెట్‌పై ఎందుకు వచ్చారంటే..**

'రాజమహేంద్రవరం రూరల్‌లోని నామవరంలో బైబిల్ కాలేజీ నిర్మాణానికి ప్రవీణ్ 510 గజాల స్థలం కొనుగోలు చేశారు. నిర్మాణ పనుల నిమిత్తం లాలాచెరువులోని ఒక గదిని కూడా అద్దెకు తీసుకున్నారు. కాలేజీ నిర్మాణ అవసరాలకు బుల్లెట్‌ని రాజమహేంద్రవరంలో ఉంచడానికి ఆయన హైదరాబాద్ నుంచి దానిపై బయల్దేరారు' అని ఐజీ చెప్పారు.

# కొమ్మా రెమ్మా కన్నీరు..

-మొదటిపేజీ తరువాయి



చావు నీది బతుకంతా దేశానిది అని కాళోజీ అంటే.. బతుకంతా ప్రకృతి సేవలోనే గడిపి.. మొక్కలు నాటడాన్ని, వాటిని పరిరక్షించడాన్నే కర్తవ్యంగా భావించి.. ఏకంగా కోటికిపైగా మొక్కలు నాటి వనజీవిగా పేరొందిన దరిపల్లి రామయ్య (79) కన్నుమూశారు. శనివారం ఉదయం గుండెపోటుతో ఆయన నిద్రలోనే మృతిచెందారు. ఆయన స్వస్థలం ఖమ్మం రూరల్ మండలం రెడ్డిపల్లి. దరిపల్లి లాలయ్య, పుల్లమ్మ దంపతులకు 1946 జూలై 1న రామయ్య జన్మించారు. ఐదేళ్ల వయసు నుంచే మొక్కలు నాటేవారు. ముత్తగూడెంలో ప్రాథమిక విద్య పూర్తిచేశారు. ఆర్థిక పరిస్థితి సహకరించకపోవడంతో పశువుల కాపరిగా మారారు. 1967లో జానమ్మను పెళ్లి చేసుకున్నారు. రామయ్య దంపతులకు కుమారులు సైదులు, సత్యనారాయణ, కనకయ్య, కూతురు సైదమ్మ ఉన్నారు. సైదులు, సత్యనారాయణ అనారోగ్యంతో మృతిచెందారు. రామయ్య కుటుంబానికి గతంలో ఏడెకరాల భూమి ఉండేది. మొక్కలు నాటేందుకు ఖర్చులకోసం మూడెకరాలను రామయ్య అమ్మారు. రహదారుల వెంట మొక్కలు నాటుతూ, రోడ్ల వెంట ఉన్న చెట్ల వద్ద కాయలు ఏరి వాటి నుంచి వచ్చిన గింజలను ఖాళీస్థలాలు, కొండలపై జల్లుతూ ఉండేవారు. ఎవరైనా మొక్కలు కావాలని ఆయన దగ్గరకు వెళితే ఉచితంగానే గింజలు, మొక్కలను అందించేవారు. పచ్చదనంపై విస్తృత ప్రచారం చేయడమే కాకుండా ఎక్కడ ఖాళీ స్థలం కనిపిస్తే అక్కడ మొక్కలు నాటడం, 'వృక్షో రక్షతి రక్షితః' అంటూ నినాదాలు రాయడం చేసేవారు. ఇంట్లో గిన్నెలు, పాత్రలు, బీరువాలు, గోడలు ఎక్కడైనా ప్రకృతికి సంబంధించిన నినాదాలే రాసేవారు. తన కుమారుడు, కూతురు పెళ్లిళ్ల శుభలేఖపై కూడా మొక్కలు నాటాలని, వాటిని పరిరక్షించాలని నినాదాలను ముద్రించారు.

**అద్భుతమైన శిల్పి కూడా**

"వృక్షో రక్షతి రక్షితః" అనేది రామయ్య నమ్మిన నినాదం.. దాన్ని ఓ ఇనుప ప్లేట్‌పై రాసి మెడలో హారంగా వేసుకుని తిరిగేవారు. రామయ్య అద్భుతమైన శిల్పి కూడా. తన ఇంటి వద్ద గ్రానైట్ రాళ్లపై శిల్పాలను చెక్కేవారు. ఆ శిల్పాలపై కూడా వృక్షోరక్షతి రక్షితః అంటూ నినాదాలు చెక్కేవారు. 2000లో వనజీవి సేవలను గర్తించిన నాటి సీఎం చంద్రబాబు, ఆనాటి ఆర్అండ్‌బీ మంత్రి తుమ్మల.. రామయ్యకు బైక్ బహూకరించి, దాని పెట్రోలు ఖర్చులకు నెలకు రూ.1500 మంజూరు చేశారు. నాటి టీడీపీ ప్రభుత్వం చేపట్టిన జన్మభూమి కార్యక్రమంలోనూ రామయ్య పాలుపంచుకున్నారు. కాగా, రామయ్య కృషిని గుర్తించిన మహారాష్ట్ర ప్రభుత్వం అక్కడి తెలుగు విద్యార్థుల కోసం 9వ తరగతిలో రామయ్య జీవితాన్ని పాఠ్యాంశంగా బోధిస్తోంది. తెలంగాణ ప్రభుత్వం ఆరో తరగతి సాంఘికశాస్త్రంలో వనజీవి గురించి పాఠ్యాంశం పొందుపరిచింది. రామయ్య మొక్కలపై ఉన్న ప్రేమతో తన నలుగురు మనవరాళ్లకు కబంద పుష్పం, చందన పుష్పం, వనశ్రీ, హరితారణ్య అనే పేర్లు పెట్టి మొక్కలపై తనకున్న ప్రేమను చాటారు. అయితే కరెన్సీ నోట్లపై మొక్కల ఫొటోలను ముద్రించాలని, గ్రీన్ కరెన్సీ రావాలని రామయ్య కోరుకునేవారు. ప్రభుత్వాల పెద్దలను కలిసినప్పుడు వారికి ఈ విషయాలనే చెప్పేవారు. కాగా, రామయ్య ప్రధానమంత్రులు, పలువురు ముఖ్యమంత్రుల నుంచి ప్రశంసలు పొందారు. నాటి చంద్రబాబు నాయుడుతో పాటు ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి చేతులమీదుగా సత్కారాలు పొందారు. 2013 ఏప్రిల్ 8న బెంగుళూరుకి చెందిన అకాడమీ ఆఫ్ యూనవర్సల్ గ్లోబల్ పీస్ అనే సంస్థ వారు వనజీవి రామయ్యకు డాక్టరేట్‌ను ప్రదానం చేశారు. నాటి ప్రధాని పీవీ నరసింహారావు, ఉమ్మడి ఏపీలో సీఎంలు చంద్రబాబు, వైఎస్ రాజశేఖర్‌రెడ్డి, రోశయ్య, తెలంగాణలో మాజీ సీఎం కేసీఆర్, ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి, నాటి గవర్నర్ సుశీల్‌కుమార్ షిండే చేతుల మీదుగా రామయ్య ప్రశంసలు, సన్మానాలు అందుకున్నారు. 2017లో అప్పటి రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ చేతుల మీదుగా పద్మశ్రీ అందుకున్నారు. 2018లో మంత్రి తుమ్మల స్వయంగా రామయ్య ఇంటికి వెళ్లి డబుల్‌బెడ్రూం ఇల్లు కట్టించి ఇచ్చారు.

# ఇంటర్‌లో భారీగా పెరిగిన ఉత్తీర్ణత

-మొదటిపేజీ తరువాయి

**అమరావతి**



ఇంటర్మీడియట్ ఫలితాల్లో ఈ ఏడాది ఉత్తీర్ణత శాతం గణనీయంగా పెరిగింది. రెండో సంవత్సరం 83శాతం, మొదటి సంవత్సరం 70శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. ఈ ఫలితాలను మంత్రి లోకేశ్ శనివారం ఉదయం 11గంటలకు విడుదల చేశారు. గత పదేళ్లలో ఎప్పుడూ లేనివిధంగా అత్యధిక ఉత్తీర్ణత శాతం ఈ ఏడాదే నమోదైంది. ప్రభుత్వ, ఎయిడెడ్ కాలేజీల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు నమోదు చేశారు. రెండు సంవత్సరాల్లోనూ బాలుర కంటే బాలికలే అత్యధికంగా ఉత్తీర్ణత సాధించి సత్తా చాటుకున్నారు. ద్వితీయ సంవత్సరంలో 80శాతం మంది బాలురు, బాలికలు 84శాతం, ప్రథమ సంవత్సరంలో బాలురు 66శాతం, బాలికలు 75శాతం మంది ఉత్తీర్ణులయ్యారు. గ్రూపుల వారీగానూ ఈసారి ఉత్తమ ఫలితాలే వచ్చాయి. జిల్లాల వారీగా సెకండ్ ఇయర్ ఫలితాల్లో 93శాతం ఉత్తీర్ణతతో కృష్ణాజిల్లా రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలిచింది. గుంటూరు (91%), ఎన్టీఆర్ (89%) జిల్లాలు తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. ఇక మొదటి సంవత్సరం ఫలితాల్లో కూడా తొలి మూడుస్థానాల్లో వరుసగా కృష్ణా, గుంటూరు, ఎన్టీఆర్ జిల్లాలే ఉండటం విశేషం. ఇక సెకండ్ ఇయర్‌లో 73శాతంతో అల్లూరి సీతారామరాజు జిల్లా, ఫస్ట్ ఇయర్‌లో 54 శాతంతో చిత్తూరు జిల్లా అట్టడుగు స్థానాల్లో నిలిచాయి. ఇంటర్ ఒకేషనల్ ఫస్ట్ ఇయర్‌లో 62శాతం, సెకండ్ ఇయర్‌లో అత్యధికంగా 77శాతం ఉత్తీర్ణత నమోదైంది. మొత్తంగా అన్ని యాజమాన్యాల కాలేజీల్లోనూ గతేడాదితో పోలిస్తే ఈసారి ఉత్తీర్ణత శాతం భారీగా పెరిగింది.

**విద్యార్థులకు సీఎం అభినందనలు**

ఇంటర్ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు సీఎం చంద్రబాబు అభినందనలు తెలిపారు. గత దశాబ్ద కాలంలో ఉత్తీర్ణతలో అద్భుతమైన మెరుగుదల కనిపించడం ఆనందంగా ఉందన్నారు. తరగతుల వారీగా వాట్సాప్ గ్రూపులు, కేర్‌టేకర్ సిస్టమ్ వంటి గేమ్ ఛేంజింగ్ సంస్కరణలను విద్యారంగంలో తీసుకురావడం వల్లే విద్యార్థులు అద్భుతాలు ఫలితాలు సాధించారని చంద్రబాబు పేర్కొన్నారు.

**మే 12 నుంచి సప్లిమెంటరీ పరీక్షలు**

ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలను మే 12 నుంచి 20 వరకు నిర్వహించనున్నట్లు ఇంటర్మీడియట్ బోర్డు తెలిపింది. అలాగే అవే తేదీల్లో విద్యార్థులు ఇంప్రూవ్‌మెంట్ పరీక్షలకు కూడా హాజరుకావచ్చని పేర్కొంది. ఈ నెల 15 నుంచి 22లోగా సప్లిమెంటరీ పరీక్షలకు దరఖాస్తు చేసుకోవడానికి గడువుగా పేర్కొది. అలాగే ఈ నెల 13 నుంచి 22 వరకు రీకౌంటింగ్, రీవెరిఫికేషన్‌కు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉందని వెల్లడించింది.

**ప్రభుత్వ జూనియర్ కాలేజీల సత్తా**

ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో ఇంటర్‌లో ఉత్తమ ఫలితాలు వచ్చాయి. గత దశాబ్దకాలంలో ఎన్నడూలేని విధంగా ఉత్తమ గణాంకాలు నమోదయ్యాయి. ఫస్టియర్ పరీక్షలకు 50,314 మంది హాజరవగా 23,799 మంది(47%) పాస్ అయ్యారు. అలాగే రెండో సంవత్సరంలో 39,783 మందికి గాను 27,276 మంది(69%) ఉత్తీర్ణులయ్యారు. 2014 నుంచి పరిశీలిస్తే ప్రభుత్వ కాలేజీలకు ఇవే అత్యుత్తమ గణాంకాలు. 2024లో ఫస్టియర్‌లో కేవలం 38శాతం మంది, సెకండియర్‌లో 58శాతం మంది మాత్రమే ఉత్తీర్ణత సాధించారు. కూటమి ప్రభుత్వం చేపట్టిన సంస్కరణలు ఉత్తమ ఫలితాలు సాధించేందుకు దోహదం చేశాయి. ఈ ఏడాది నుంచి ఇంటర్ బోర్డు విద్యార్థులకు ఉచితంగా పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలు అందజేస్తోంది. మధ్యాహ్న భోజన పథకాన్ని పునరుద్ధరించింది. 217 కాలేజీలకు ప్రిన్సిపాళ్లను నియమించింది. విద్యార్థుల అభ్యసన సామర్థ్యాల ఆధారంగా ఏ,బీ,సీ కేటగిరీలుగా వర్గీకరించి వెనకబడిన వారిపై ప్రత్యేక దృష్టిసారించారు. ఈ చర్యలతో ప్రభుత్వ కాలేజీల్లో ఉత్తమ ఫలితాలు నమోదయ్యాయి. ఈ విభాగంలో రెండో సంవత్సరం లో పార్వతీపురం మన్యం (81%), గుంటూరు (76%), అన్నమయ్య (76%)తో టాప్‌లో ఉండగా... విశాఖపట్నం (55%), అనకాపల్లి (61%), బాపట్ల(63%) అట్టడుగున ఉన్నాయి.

**మంత్రి లోకేశ్ ప్రత్యేక శ్రద్ధ**

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చేనాటికి ఇంటర్ విద్యా సంవత్సరం ప్రారంభమైంది. మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రిగా లోకేశ్ బాధ్యతలు చేపట్టిన వెంటనే జూనియర్ కాలేజీలపై సమీక్షించారు. విద్యార్థులకు పాఠ్యపుస్తకాలతో పాటు బ్యాగులు, నోట్‌బుక్స్ కూడా ఇచ్చారు. దీంతో అడ్మిషన్లు కూడా పెరిగాయి. 15వేల మంది అదనంగా ప్రభుత్వ కాలేజీల్లో చేరారు. ఉత్తీర్ణత శాతం కూడా పెరిగింది

**ఫెయిలైనవారు నిరాశ పడొద్దు**

ఇంటర్ ఫలితాలపై మంత్రి లోకేశ్ ఎక్స్ వేదికగా స్పందించారు. 'ఇంటర్ ఫలితాలలో గత పదేళ్లలో అత్యధిక ఉత్తీర్ణత శాతం నమోదైనందుకు ఆనందంగా ఉంది. ప్రత్యేకించి ప్రభుత్వ, ప్రభుత్వ ఆధ్వర్యంలోని సంస్థల్లో మెరుగుదల కనిపించింది. ఉత్తీర్ణత సాధించలేకపోయిన విద్యార్థులు నిరాశ చెందకండి. దీనిని ఒక అడుగుగా భావించి మరింత కృషి చేసి మరింత బలంగా తిరిగి రావాలని కోరుకుంటున్నాం. ప్రతి విద్యార్థికి శుభాకాంక్షలు' అని లోకేశ్ పేర్కొన్నారు.

**అన్ని సబ్జెక్టుల్లో 98 శాతం.. ఇంగ్లీషులో 5 మార్కులే..!**

ఇంటర్ మొదటి సంవత్సరంలో 98 శాతం మార్కులు సాధించింది. ద్వితీయ సంవత్సరం సంస్కృతం (98), మ్యాథ్స్ 2ఏ (73), మినహా మిగిలిన అన్ని సబ్జెక్టుల్లోనూ 100 శాతం మార్కులొచ్చాయి. కానీ.. సెకండియర్ ఇంగ్లీషులో మాత్రం 5 మార్కులే వచ్చాయి. దీంతో ఆ విద్యార్థిని ఫెయిల్ అయింది. విజయవాడ పటమటకు చెందిన దండే రాజేశ్వరి.. నారాయణ ఏసీఈసీ క్యాంప్‌సలో ఇంటర్ చదివింది. ఫస్టియర్‌లో ఆమెకు 98 శాతం మార్కులు వచ్చాయి. ఇంగ్లీషులో 94 మార్కులు సాధించింది. సంస్కృతంలో 99, గణితం 1(ఎ)లో 75, 1(బీ)లో 75, ఫిజిక్స్‌లో 60, కెమిస్ట్రీలో 58 మార్కులు సాధించింది. కానీ.. సెకండియర్‌లో సంస్కృతంలో 98, గణితం 2(ఎ)లో 73, 2(బి)లో 75, ఫిజిక్స్‌లో 60, కెమిస్ట్రీలో 60 మార్కులు సాధించింది. ఇంగ్లీషులో మాత్రం ఐదు మార్కులే వచ్చినట్టు చూపించింది. దీంతో మొత్తం 892 మార్కులు సాధించినప్పటికీ ఆమె ఫెయిల్ అయింది. బాగా చదివే ఆమెకు ఇంగ్లీషులో ఐదు మార్కులే రావడంతో కన్నీరుమున్నీరవుతోంది

# రాష్ట్రపతికీ గడువు

-మొదటిపేజీ తరువాయి

న్యాయస్థానం తనకున్న విశేషాధికారాలను ఉపయోగించి ఆ బిల్లులు ఆమోదం పొందినట్టుగా ఏప్రిల్ 8న తీర్పునిచ్చిన సంగతి తెలిసిందే. ఎన్నికైన ప్రజాప్రభుత్వాలు పంపే బిల్లుల విషయంలో నిర్ణయానికి సంబంధించి.. నాడు గవర్నర్లకు గడువు విధించిన సుప్రీంకోర్టు రాష్ట్రపతికి సైతం గడువును నిర్దేశించడం విశేషం. ఈమేరకు 415 పేజీల తీర్పు కాపీని సుప్రీంకోర్టు శుక్రవారం రాత్రి 10.54 గంటలకు తన వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేసింది.

**మినహాయింపు లేదు..**

గవర్నర్‌కుగానీ, రాష్ట్రపతికిగానీ సంపూర్ణ వీటో అధికారాలు లేవని సుప్రీం తన తీర్పులో తేల్చిచెప్పింది. "ఏ బిల్లు విషయంలోనూ గవర్నర్‌కు సంపూర్ణ వీటో అధికారాలు ఉండవని మేం (తీర్పులోని ముందరి పేరాల్లో) పేర్కొన్నాం. అదే ప్రమాణాన్ని.. రాష్ట్రపతికి వర్తింపజేయకుండా ఉండడానికి మాకు ఏ కారణమూ కనపడట్లేదు. రాజ్యాంగం అంతటా కనిపించే ఈ ప్రామాణిక సూత్రానికి రాష్ట్రపతి ఏమీ మినహాయింపు కాదు. అటువంటి అదుపులేని (హద్దుల్లేని) అధికారాలు ఈ రెండు రాజ్యాంగ పదవుల్లో ఏ ఒక్కదానికీ ఉండరాదు" అని తీర్పులో స్పష్టం చేసింది. ఏదైనా ఒక బిల్లు రాష్ట్ర జాబితాలోనిదై ఉండి.. ఆ బిల్లును రాష్ట్ర మంత్రివర్గ సలహాకు విరుద్ధంగా గవర్నర్ రాష్ట్రపతి పరిశీలనకు పంపినప్పుడు, ఆ బిల్లును ఎక్కువకాలం పెండింగ్‌లో పెడితే.. న్యాయ సమీక్షలో భాగంగా కోర్టులు ఆ బిల్లు నిలుపుదలకు గల కారణాలను పరిశీలించవచ్చని సుప్రీం ధర్మాసనం స్పష్టం చేసింది. ఒకవేళ తగిన కారణాలు చెప్పకుండా పెండింగ్‌లో పెడితే.. రాష్ట్రపతి, కేంద్ర ప్రభుత్వం నిజాయతీతో వ్యవహరించకపోయి ఉండొచ్చని భావించడానికి తాము సంకోచించబోమని స్పష్టం చేసింది. రాజ్యాంగపరమైన అంశాలు ఇమిడి ఉన్న బిల్లులు, రాష్ట్రపతి ఆమోదం అవసరమయ్యే బిల్లుల విషయంలో.. వాటిని శాసనసభలో ప్రవేశపెట్టడానికి ముందే కేంద్ర ప్రభుత్వంతో సంప్రదించాలని రాష్ట్రప్రభుత్వాలకు సుప్రీంకోర్టు సూచించింది. అలా రాష్ట్రప్రభుత్వాల నుంచి వచ్చే శాసనపరమైన ప్రతిపాదనలను వీలైనంత వేగంగా పరిగణనలోకి తీసుకోవాలని కేంద్రానికి సూచించింది. తద్వారా కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సంబంధాల్లో ఘర్షణ వాతావరణం తగ్గుతుందని.. భవిష్యత్తులో వచ్చే అవకాశం ఉన్న అడ్డంకులను ముందే నిరోధించవచ్చని పేర్కొంది.




-మొదటిపేజీ తరువాయి

హర్షల్‌కు నాలుగు, ఎషాన్‌కు రెండు వికెట్లు దక్కాయి. ఆ తర్వాత ఛేదనలో సన్‌రైజర్స్ 18.3 ఓవర్లలో 2 వికెట్లకు 247 పరుగులు చేసి గెలిచింది. హెడ్ (66), క్లాసెన్ (21 నాటౌట్) రాణించారు. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా అభిషేక్ నిలిచాడు.

**ఏమా బాదుడు..?**: 246 పరుగుల ఛేదనలో సన్‌రైజర్స్ ఏ దశలోనూ వెనక్కితగ్గలేదు. ఓపెనర్ అభిషేక్ శర్మ వాయువేగంతో పరుగులు రాబట్టగా.. అటు మరో ఓపెనర్ హెడ్ చక్కగా సహకరించాడు. పూర్తిగా బ్యాటింగ్‌కు అనుకూలించిన పిచ్‌పై ఈ ఇద్దరూ వీరంగమే ఆడారు. అయితే 29 పరుగుల వ్యక్తిగత స్కోరు వద్ద అభిషేక్ క్యాచ్ అవుటైనా అది నోబ్‌గా తేలడంతో బతికిపోయాడు. ఇక పవర్‌ప్లేలో 83 రన్స్‌తో జట్టు ఛేదన వైపు వేగంగా సాగింది. ఎట్టకేలకు 13వ ఓవర్‌లో హెడ్‌ను చాహల్ అవుట్ చేయగా తొలి వికెట్‌కు 171 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. కానీ అదే ఓవర్‌లో సింగిల్‌తో అభిషేక్ 40 బంతుల్లోనే సెంచరీ పూర్తి చేసి 'ఇది ఆరెంజ్ ఆర్మీ కోసం' అంటూ ఓ పేపర్‌ను చూపాడు. వన్‌డౌన్‌లో క్లాసెన్ క్రీజులోకి వచ్చినా అభిషేక్‌దే హవా సాగింది. బౌండరీలతో హోరెత్తిస్తూ లక్ష్యాన్ని వేగంగా కరిగించాడు. చివరకు 23 బంతుల్లో 24 రన్స్ కావాల్సిన వేళ అర్ష్‌దీపకు చిక్కాడు. ఆ తర్వాత క్లాసెన్ బౌండరీల హోరుతో మరో 9 బంతులుండగానే మ్యాచ్ ముగిసింది.

# 14 నెలలోనే డోర్నకల్ అభివృద్ధి

### సన్న బియ్యం పథకం దేశానికే ఆదర్శం
### జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు డాక్టర్ బత్తుల శ్రీనివాస్ యాదవ్

స్వర్ణ సాగరం డోర్నకల్ ఏప్రిల్ 12

డోర్నకల్ లో గత 30 ఏళ్లుగా జరగని అభివృద్ధిని 14 నెలలోనే ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే రామచంద్రనాయక్ చేసి చూపించారని , జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు బత్తుల శ్రీనివాస్ యాదవ్ అన్నారు, జై బాపు, జై భీమ్, జై సంవిధాన్, కార్యక్రమంలో భాగంగా డోర్నకల్ మండలంలోని రాము తండా, అమ్మపాలెం, బంజర గ్రామాలలో ఉన్న గ్రామ పార్టీ అధ్యక్షులకు జాతీయ జెండాను అందించి రాజ్యాంగ పరిరక్షణ యాత్రను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేదల కడుపు నింపాలనే లక్ష్యంతో దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా సీఎం రేవంత్ రెడ్డి, సన్న బియ్యం పథకాన్ని ప్రవేశపెట్టారని పేర్కొన్నారు. సన్నబియ్యం పథకంలో కేంద్ర ప్రభుత్వం వాటా ఉందని బిజెపి నాయ కులు గగ్గోలు పెడుతున్నారనని మరి బిజెపి ప్రభుత్వాం ఉన్న రాష్ట్రాలలో సన్న బియ్యం పథకం ఎందుకు ప్రవేశపెట్టలేదని వారు ప్రశ్నించారు. కార్యక్రమంలో మండలధ్యక్షుడు జగదీష్, బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కాసం శేఖర్ , నాయకులు ఆంగోత్ వెంకన్న, బుద్ధిస్ట్ సొసైటీ జిల్లా అధ్యక్షుడు చిలకబత్తిని మాణిక్య రాజు, గ్రామ పార్టీ అధ్యక్షులు నల్ల మాస రమేష్ ,విష్ణువర్ధన్ రెడ్డి, బండి ఉదయ్, మండల యూత్ బత్తుల రాజు, డిజె శ్రీనివాస్, వీరభద్రం, నంద ,రాము, కాంగ్రెస్ నాయకులు తదితరులున్నారు




తిరుపతి
చిత్తూరు నెల్లూరు అనంతపురం
విలేకరులు కావలెను
సంప్రదించండి : 9440352036

## రాష్ట్ర స్థాయి ర్యాంకులతో మరోమారు మెరిసిన విద్యానికేతన్ ఆణిముత్యాలు




### ఇంటర్ మొదటి-ద్వితీయ ఫలితాల్లో ఫలితాల సునామీ..

వి.కోట స్వర్ణ సాగరం ఏప్రిల్ 12:-

చిత్తూరు జిల్లా వికోట పట్టణంలో ఇంటర్ విద్యలో పెను సంచలనాలు సృష్టిస్తున్న విద్యానికేతన్ విద్యా సంస్థలు శనివారం విడుదలైన ఇంటర్ ఫలితాలలో మరోమారు రాష్ట్ర స్థాయి ర్యాంకులతో ఫలితాల సునామీని సృష్టించింది. కరస్పాండెంట్ డా.ఎస్ ఆర్ దామోదర్ రెడ్డి మాట్లాడుతూ ఇంటర్ ద్వితీయ సంవత్సరం బైపీసీ విభాగంలో 1000 కి 986 మార్కులతో రాష్ట్ర స్థాయి 6వ ర్యాంకు సాధించి చరిత్రను తిరగరాశారని తెలిపారు. అదేవిధంగా మొదటి సంవత్సర విద్యార్థుల్లో ఎంపిసి విభాగంలో నేహా అలీఖాన్ లోడీ 470కి గాను 463 మార్కులతో ,రాష్ట్ర స్థాయి 5వ ర్యాంకు సాధించిందని, అయేషా 440కి గాను 434 మార్కులు సాధించి స్టేట్ 4వ ర్యాంకు సాధించిందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా యాజమాన్యం మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతమైన వికోటలో అతి తక్కువ కాలంలో విద్యారంగంలో అనేక సంచలనాలు నమోదు చేస్తూ రాబోయే విద్యా సంవత్సరం కేవలం అమ్మాయిలకే ఇంటర్-డిగ్రీ కళాశాలగా విద్యానికేతన్ ఉత్తమ శిక్షణను అందిస్తుందని ,ఈ అవకాశాన్ని అందరు తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రిన్సిపల్ సంధ్యారాణి, అడ్మినిస్ట్రేటివ్ డైరెక్టర్ మునిరత్నం ,అడ్మిషన్స్ వింగ్ డైరెక్టర్ తుకారామ్ ,అధ్యాపకులు పాల్గొన్నారు.యాజమాన్యం ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు అభినందనలు తెలియజేశారు.

## "వాటర్ బేస్ యాజమాన్యం పటిష్టమైన భద్రత తీసుకోవాలి"




### టిడిపి రాష్ట్ర కార్యదర్శి బొమ్మి సురేంద్ర

తోటపల్లి గూడూరు స్వర్ణ సాగరం ఏప్రిల్ 12

మండలంలోని అనంత వరం వాటర్ బేస్ కంపెనీలో శనివారం చేసుకున్న అమ్మోనియం గ్యాస్ లీకేజీ సంఘటనపై సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి ఆదేశాలతో మండల టిడిపి నేతలతో కలిసి జరిగిన సంఘటనను పరిశీలించారు. ఈ సందర్భంగా సురేంద్ర మాట్లాడుతూ ఉదయం జరిగిన సంఘటన లో కొంతమంది గాయపడ్డారని వారికి అవసరమైన చికిత్సలు జరిపినట్లు వారు క్షేమంగా ఉన్నట్లు తెలిపారు. ఇటీవల కంపెనీలు ఇటువంటి సంఘటనలు జరుగుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు.కార్మికుల సంక్షేమం దృష్ట్యా తగిన పర్యవేక్షణ ద్వారా కంపెనీలో రక్షణ చర్యలు పటిష్టంగా చేపట్టాలన్నారు. తాము ఇక్కడ పరిశీలించిన సంఘటన విషయాలను ఎమ్మెల్యే దృష్టికి తెస్తామని తెలిపారు. ఈ పరిశీలనలో టిడిపి నేతలు కోడూరు శ్రీనివాసుల రెడ్డి కొణతంరఘు బాబు మాగుంట రమణారెడ్డి ఆవుల మునిరత్నం తదితరులు ఉన్నారుమొదటినుంచి ఈ కంపెనీ మీడియా ప్రతినిధులను లోపలికి అనుమతించకపోవడం జరుగుతున్న వాస్తవ సంఘటనలు బహిర్గతం చేయకపోవడం పలు విమర్శలకు దారితీస్తుంది

## అకాల వర్షానికి తడిచిన ధాన్యాన్ని పరిశీలించిన సర్వేపల్లి జనసేన నేత బొబ్బేపల్లి



వెంకటాచలం స్వర్ణ సాగరం ఏప్రిల్ 12

మండలంలోని తిరుమలమ్మ పాలెం గ్రామం తోపాటు చుట్టుపక్కల గ్రామాలలో నిన్న అర్ధరాత్రి అకస్మికంగా ఉరుములతో కూడిన గాలి వాన రావడంతో రైతులు ఆరుగాలం పండించిన పంటని కోత కోసి ఆరబెట్టుకొని ఉన్న తరుణంలో ఆ వర్షానికి తడవడం జరిగింది తడిచిన ధాన్యాన్ని మళ్లీ ఆరబెట్టుకునే తరుణంలో కూలీల కోసం అయ్యే ఖర్చు ఎక్కువ అవ్వడంతో కాస్త ఇబ్బందులు పడుతూ మా దృష్టికి రావడం జరిగింది ఈరోజు అక్కడకు వెళ్లి పరిశీలించాం ప్రభుత్వం ద్వారా రంగు మారిన ధాన్యాన్ని ఏ విధంగా కొనుగోలు చేయాలా అనేటువంటి విషయాన్ని కూడా స్థానిక శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ దృష్టికి తీసుకువెళ్లి ప్రభుత్వ పరంగా ఏ విధంగా ఆదుకోవాలో ఆదుకునే ప్రయత్నం చేస్తామని మనస్ఫూర్తిగా రైతులకి తెలియజేయడం మనోధైర్యాన్ని ఇవ్వడం జరిగింది.ఈ కార్యక్రమంలో పినిశెట్టి మహేష్, మండల కార్యదర్శి సంధురూ శ్రీహరి, స్థానిక మండల నాయకులు చల్లా చెంచయ్య, మణి, తదితరులు పాల్గొన్నారు.

## పెట్టుబడులు పెట్టి మోసపోవద్దు

### డీఎస్పీ సాయి ఈశ్వర్ యశ్వంత్



కనిగిరి స్వర్ణసాగరం ఏప్రిల్ 12

రిజిస్ట్రేషన్ లేని ఇన్వెస్ట్మెంట్ కంపెనీలలో పెట్టుబడులు పెట్టి మోసపోవద్దని కనిగిరి డిఎస్పి సాయి ఈశ్వర్ యశ్వంత్ తెలిపారు.అలాగే తెలిసిన వారే కదా అని చీటీలు కూడా వేయవద్దన్నారు.పర్మిషన్ లేకుంటే ఇలాంటివి నిర్వహిస్తే పోలీసులు దృష్టికి తీసుకురావాలని కోరారు. అటువంటి వారిపై చట్ట ప్రకారము కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## సత్యాగ్రహ గాంధీఆశ్రమాన్ని సందర్శించిన మాగుంట మనుమడు




ఇందుకూరుపేట స్వర్ణ సాగరం ఏప్రిల్ 12

ని పల్లిపాడు పినాకిని గాంధీజీ సత్యాగ్రహఆశ్రమాన్ని ప్రముఖ పారిశ్రామిక వేత్త దివంగత మాగుంట సుబ్బరామిరెడ్డి మనవడు సుబ్బరామిరెడ్డి మన గాంధీ ఆశ్రమాన్ని శనివారం సందర్శించారు. ఈ సందర్శనలో ముందుగా మహాత్మా గాంధీ విగ్రహానికి ఖాదీ వస్త్రము మరియు నూలుమాల సమర్పించారు, అదేవిధంగా ఆశ్రమ స్థల దాత పోనక.కనకమ్మ విగ్రహానికి పట్టు వస్త్రము మరియు నూలుమాల సమర్పించారు. అనంతరం ఆశ్రమ కోకన్వీనర్ నెల్లూరు రవీంద్రారెడ్డి ఆశ్రమ పరిసర ప్రాంతాలను చూపించి ఆశ్రమ చరిత్ర గురించి వివరించారు. ఈ సందర్భంగా మాజీ రెడ్ క్రాస్ చైర్మన్ ఏవి సుబ్రహ్మణ్యం గారు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం రద్దు: జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్

చిత్తూరు,స్వర్ణసాగరం,ఏప్రిల్ 12



ఈనెల 14 వ తేదీ సోమవారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ జయంతి సందర్భంగా ప్రభుత్వ సెలవు దినం కావడం తో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం రద్దు చేసినట్లు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.ప్రభుత్వ సెలవు దినం కావడం తో జిల్లా,డివిజన్, మండల స్థాయి లో జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాలు రద్దు చేస్తున్నట్లు,ఈ విషయాన్ని అర్జీదారులు గమనించాలని శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

## అంబేద్కర్ జయంతికి ముమ్మర ఏర్పాట్లు



### కనిగిరి మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్

కనిగిరి స్వర్ణ సాగరం ఏప్రిల్ 12

డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జయంతి కార్యక్రమం ఈనెల 14న ఘనంగా నిర్వహించేందుకు ముందుగా ఏర్పాట్లు చేస్తున్నట్లు కనిగిరి మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్ తెలిపారు.కనిగిరి పట్టణంలోని ఒంగోలు బస్టాండు వద్ద ఉన్నటువంటి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి రంగులు వేసి సర్వాంగ సుందరంగా తీర్చి దిద్దుతున్నట్లు ఆయన తెలిపారు.రాజకీయాలకు అతీతంగా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జయంతిని ఘనంగా నిర్వహించేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఆయన తెలిపారు.

## తిరుపతి ఎమ్మెల్యే ఆరని శ్రీనివాసులు కలిసిన పలువురు జనసేన నాయకులు

సత్యవేడు స్వర్ణ సాగరం ఏప్రిల్ 12



తిరుపతి ఎమ్మెల్యే ఆరని శ్రీనివాసులను సత్యవేడు నియోజకవర్గానికి చెందిన పలువురు జనసేన నాయకులు కలిశారు.శనివారం తిరుపతి జనసేన పార్టీ కార్యాలయంలో సత్యవేడు జనసేన నాయకుడు బాలమురళీకృష్ణ ఆధ్వర్యంలో జనసేన నాయకులు పలువురు తిరుపతి ఎమ్మెల్యే ఆరని శ్రీనివాసులు కలిసి సమస్యలను వివరించారు.పార్టీ బలోపేతం నామినేటెడ్ పదవుల భర్తీ చేయడం,కార్యకర్తల సమస్యలను ఆయనకు వివరించారు.సమస్యలను పార్టీ హై కమాండ్ దృష్టికి తీసుకెళ్తానని ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆరని శ్రీనివాసులు హామీ ఇచ్చారు. అనంతరం శ్రీకొణిదల పవన్ కళ్యాణ్ కుమారుడు మార్క్ శంకర్ పవనో విచ్ అనారోగ్యం నుంచి త్వరగా కోలుకోవాలని తిరుపతి అలిపిరి శ్రీ వెంకటేశ్వర స్వామి పాదాల చెంత కొబ్బరికాయలు కొట్టి మొక్కలు తీర్చుకున్నారు.ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు,ఉమ్మడి చిత్తూరు జిల్లా కార్యదర్శి తడ శ్రీనివాసులు,పిఆర్ బాలాజీ,విజయ్ కుమార్, ఠాగూర్,సుబ్రమణ్యం,రమేష్,కన్నయ్య,రూప్ కుమార్, బాబి,తదితరులు పాల్గొన్నారు

# కార్మికుల కనీస వేతనం, ఉపాధి కై పోరాటం - అంగేరి పుల్లయ్య

### సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుల సభలో పిలుపు

రేణిగుంట స్వర్ణ సాగరం

రేణిగుంట పుచ్చలపల్లి సుందరయ్య కార్యాలయం వద్ద శనివారం నాడు సిఐటియు మండల జనరల్ బాడీ మీటింగ్ పి రాజశేఖర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు అంగేరి పుల్లయ్య ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అంగేరి పుల్లయ్య మాట్లాడుతూ మే 1న ప్రపంచ కార్మికుల ఐక్యత కు స్ఫూర్తిగా 8 గంటల పని విధానం సాధించుకున్న హక్కుల దినముగా ఎర్రజెండా ఎగరవేసి మేడే సంబరాలు కార్మికులు జరుపుకుంటారని తెలిపారు. భారతదేశంలో బిజెపి పార్టీ మూడోసారి కేంద్రంలో అధికారంలోకి వచ్చిన తర్వాత కార్మికులు, రైతులు, నిరుద్యోగ యువత హక్కులకై పోరాటం బాట పడుతున్నారని తెలిపారు. మే డే స్ఫూర్తితో మే 20వ తేదీన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె సందర్భంగా రేణిగుంట మండల కేంద్రంలో కార్మికులు కలిసి చేసే ప్రదర్శనలో నివాస ప్రాంతం కార్మికులు వలస కూలీలు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయవలసిందిగా పిలుపు ఇచ్చారు. సిఐటియు మండల కార్యదర్శి హరినాథ్ మాట్లాడుతూ దేశంలో నిత్యవసర సరుకుల పెరిగే ధరలకు అనుగుణంగా కార్మికులకు కనీస వేతనం అమలు చేయాలని, 4 లేబర్ కోడ్లను వెంటనే రద్దు చేయా లని, నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పన కై ఎర్రజెండా సిఐటియు పోరాటాలు నడుపుతుందని తెలిపారు.



# వాటర్ బేస్ రొయ్యల ఫ్యాక్టరీ ప్రమాదం పై విచారణ జరపాలి



తోటపల్లి గూడూరు స్వర్ణ సాగరం ఏప్రిల్ 12

మండలంలోని అనంతవరం గ్రామంలోవాటర్ బేస్ రొయ్యల ప్రాసెసింగ్ యూనిట్లో ఆమోనియం గ్యాస్ లీకై పదిమందికి పైగా కార్మికులు తీవ్ర అస్వస్థకు గురైనరని ఒకరు పరిస్థితి విషమంగా ఉందని వార్తలు వస్తున్నాయి ఈ సంఘటనపై అధికారులు విచారణ చేపట్టాలని సిఐటియు తోటపల్లి గూడూరు మండల కార్యదర్శి మారుబోయిన రాజా డిమాండ్ చేశారు. వాటర్ బేస్ రొయ్యల ఫ్యాక్టరీ వద్ద ప్రమాదానికి గురైన కార్మికులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని మూడు నెలల వేతనాన్ని ఇవ్వాలని డిమాండ్ చేశారు అమోనియం గ్యాస్ సంఘటనపై విచారణ చేపట్టాలని వాటర్ బేస్ కంపెనీ వద్ద ఆందోళన నిర్వహించి అధికారులను డిమాండ్ చేశారు. ఫ్యాక్టరీలపై అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో ఇటువంటి సంఘటనలు ఉంధృతం అవుతున్నాయని ఇప్పటికైనా అధికారులు ఫ్యాక్టరీలను పర్యవేక్షించి సేఫ్టీ మెజర్మెంట్స్ ని తనిఖీ చేయాలని డిమాండ్ చేశారు. బయట రాష్ట్రాల నుంచి వచ్చిన కార్మికుల స్థితిగతులపై జిల్లా అధికారులకి కనీస అవగాహన లేదని అంతర్ రాష్ట్ర వలస కార్మికుల చట్టం ఎక్కడ అమలు కావడం లేదని ఈ సందర్భంగా తెలియజేశారు. ప్రమాదానికి గురైన కార్మికులకే న్యాయం చేయాలని లేని పక్షంలో సిఐటియు ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించారు ఈ కార్యక్రమంలో లక్ష్మయ్య శ్రీనివాసులు సిఐటియు మహిళా నాయకురాలు కందిపాటి రమణమ్మ ధారా సుబ్బయ్య నాశిన శ్రీనివాసులు

# "ఇంటర్లో 100% ఫలితాలు సాధించిన కోడూరు బాలికల గురుకుల కళాశాల"



## "ప్రిన్సిపాల్ ఎస్తేరమ్మ "బోధనా సిబ్బంది కృషి కారణమంటున్న బాలికలు తల్లిదండ్రులు

తోటపల్లి గూడూరు స్వర్ణ సాగరం ఏప్రిల్ 12

కృషి ఉంటే మనుషులు ఋషులవుతారు అన్న సామెత సర్వేపల్లి నియోజకవర్గం తోటపల్లి గూడూరు మండలం డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ కోడూరు బాలికల గురుకుల కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరంలో 100% ఫలితాలు సాధించడంలో ప్రిన్సిపాల్ ఎస్తేరమ్మ బోధనా సిబ్బంది కృషి కారణమని ఇటు బాలికలు తల్లిదండ్రులు హర్షం వెలిబుచ్చారుమొదటినుంచి ప్రిన్సిపాల్ ఎస్తేరమ్మ ఇంటర్ విద్యార్థుల విషయంలో ప్రత్యేక దృష్టి పెట్టడం ఉపాధ్యాయుల సమిష్టి కృషి ఈ ఫలితాలకు ప్రధాన కారణాలుగా తెలుస్తుంది. శనివారం విడుదలైన ఫలితాలలో సీనియర్ ఇంటర్ ఎంపీసీ కి చెందిన

వి ప్రవల్లిక 1000/986సీనియర్ బైపీసీలోడి భావన 1000/986 మార్కులు సాధించడంతోపాటు కళాశాల ద్వారా100%సీనియర్ ఇంటర్మీడియట్ లో బాలికలు ఉత్తమ ఫలితాలు సాధించారుఇక జూనియర్ ఇంటర్మీడియట్ ఎంపీసీలో ఏ తేజస్విని

457/470 సాధించగా మరో బాలిక కే జ్యోత్స్న జూనియర్ బైపీసీలో432/440 సాధించారు మొత్తం జూనియర్ ఇంటర్లో కళాశాల 97% ఫలితాలు సాధించడం జరిగింది. ఈ సందర్భంగా ఉత్తమ ఫలితాలు సాధించిన కోడూరు బాలికల గురుకుల కళాశాలకు అభినందన ప్రశంసలు లభించడం విశేషం

# కాణిపాకంవైభవంగా సత్యనారాయణ వ్రతం

## రాత్రి గ్రామోత్సవం

కాణిపాకం ఏప్రిల్ 12 స్వర్ణ సాగరం



వ్రతంలో పాల్గొన్న భక్తులు. కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయక స్వామి వారి దేవస్థానం అనుబంధ దేవాలయమైన శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వరదరాజ స్వామి వారి ఆలయం నందు శనివారం పౌర్ణమి సందర్భంగా వైభవంగా సత్యనారాయణ స్వామి వ్రతం నిర్వహించడం జరిగింది. రాత్రి గ్రామోత్సవం నిర్వహించారు స్వామి వారి మాట విధులలో భక్తులకు దర్శనమిచ్చారు భక్తులు కొబ్బరికాయలు కొట్టి స్వామివారికి హారతులు పట్టారు, ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో పెంచల కిషోర్, సూపర్డెంట్ వాసు, టెంపుల్ ఇన్స్పెక్టర్ రవి అర్చకులు, తదితరులు ఉన్నారు.

# కంచరపాలెంలో కాశీ విశాలాక్షి విశ్వనాధుని కళ్యాణోత్సవం.







వరదయ్యపాలెం స్వర్ణ సాగరం ఏప్రిల్ 12

కంచరపాలెం గ్రామంలో వైభవంగా శ్రీ పెరంటాల్లమ్మ ఆలయం వద్ద కాశీ విశాలాక్షి -విశ్వనాధ స్వామి కళ్యాణ మహోత్సవంను గ్రామస్థులు ఘనంగా నిర్వహించారు.శివరాత్రికి జరుపవలసిన కళ్యాణం కొన్ని అనివార్యకారణాల వలన వాయిదా పడటం చేత,పౌర్ణమి శు భ తిథి సందర్భంగా వైభవోపేతంగా స్వామి -అమ్మ వార్ల కళ్యాణ మహోత్సవం ను ఆలయ నిర్వాహకులు సుబ్రహ్మణ్యం-రేవతి దంపతులు మరియు గ్రామస్థులు ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది.ప్రధాన అర్చకులుగా పాండూరు శంకరయ్య స్వామి ఆధ్వర్యంలో, హోమం కార్యక్రమం నిర్వాహకులుగా కంచరపాలెం కు చెందిన తాళ్ల బాలాజీ కుమార్ (కిరణ్), గోవర్ధపురం కు చెందిన బొప్పన మోహన్ బాబు లు పురోహిత కార్యక్రమం నిర్వహించారు.పూజా కార్యక్రమంలో శ్రీధర్ రూప, షణ్ముఖ-అపర్ణ,పృథ్వి సతీష్ - భాగ్యలక్ష్మి దంపతులు, హోమం,పూజ కార్యక్రమంలో పాల్గొన్నారు.గ్రామ ఉప సర్పంచ్ మచ్చా సుమతి- తులసి రామ్ దంపతుల ు,గ్రామ పెద్దలు,గ్రామ స్థులు,గ్రామ బంధువులు తదితరులు పాల్గొన్నారు.

# "అనంతవరం వాటర్ బేస్ లో అమ్మోనియం గ్యాస్ పైప్ లీకేజ్"






## పలువురికి గాయాలు ఆందోళన అవసరం లేదన్న ఆర్డీవో

## నాగ సంతోష్ అనూషకంపెనీ ప్రతినిధులు

తోటపల్లి గూడూరు స్వర్ణ సాగరం ఏప్రిల్ 12

మండలంలోని అనంతవరం వాటర్ బేస్ లో శనివారం అమ్మోనియా గ్యాస్ మెషిన్ రూమ్ లో లీకేజ్ కావడంతో పలువురికి గాయాలైనాయి. అలారం మోగగానే సిబ్బంది భయంతో గం బూట్లతో బయటకు పరుగులు తీశారు. భయంతో కొందరు నేలపై పడిపోవడంతో వారిని నెల్లూరు పెన్నా హాస్పిటల్ లో చేర్పించి చికిత్సలు అందిస్తున్నారు. ఈ విషయమై పెద్దగా ఆందోళన అవసరం లేదని పరిస్థితి అదుపులో ఉందని నెల్లూరు రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్ నాగ సంతోష్ అనూష సీఈవో ఆకుల రమాకాంత్ ఎండి వరుణ్ టాపర్ హెచ్ ఆర్ సుధీర్ తెలిపారు. ప్లాంట్ లో పనిచేస్తున్న 50 మంది సిబ్బంది సైరన్ మోత విని బయటకు వచ్చే క్రమంలో తోపులాట కారణంగా అస్సాం కు చెందిన మీనా, ఒరిస్సా రాష్ట్రానికి చెందిన భాషఆపరేటర్ మావిళ్ళపాటి సురేష్ కు స్వల్ప గాయాలైనాయి. సంఘటన స్థలాన్ని రెవెన్యూ పోలీస్ అధికారులు పరిశీలించి వాస్తవ వివరాలను సేకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వదంతులు నమ్మవద్దనిగ్యాస్ లీకేజ్ అరికట్టామని ఆందోళన అవసరం లేదని విజ్ఞప్తి చేశారు

# నాగలాపురంలో మెరిసిన పేదింటి కుసుమాలు

నాగలాపురం -స్వర్ణ సాగరం,ఏప్రిల్ 12:



నాగలాపురం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువు తున్న విద్యార్థులు అత్యుత్తమ మార్కులు సాధించి అందరి మన్న నలు పొందారు.కళాశాల ప్రిన్సిపాల్ శ్రీలత చొరవతో స్టడీ హవర్లు కండక్ట్ చేసి పేదింటి బిడ్డల జీవితాలను మార్చారు.ఇంటర్ మొదటి సంవత్సరం బైపిసి చదువుతున్న లక్ష్మి 440 మార్కులకు గాను 400 మార్కులు సాధించింది.అలాగే సీఈసీలో పద్మప్రియ 500/423 మార్కులు తెచ్చుకుంది. వొకేషనల్ 447/500,ఎం. రెస్వంత్ రావు 908/1000.మొదటి సంవత్సరం 87.50%,రెండవ సంవత్సరం 87.84%,వొకేషనల్ మొదటి సంవత్సరం 21/26,వొకేషనల్ రెండవ సంవత్సరం 24/29 విద్యార్థులు పాస్ అయినట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఎం.శ్రీలత తెలిపారు.

.అడ్మిషన్లు ప్రారంభం :

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అడ్మీషన్లు ప్రారంభమై విధ్యార్థులకు తరగతులు ప్రారంభించినట్లు ప్రిన్సిపాల్ శ్రీలత తెలిపారు.మే 12 నుండి ఫెయిల్ అయిన విధ్యార్థులకు ఇంటర్ సప్లమెంటరీ పరీక్షలు ఉంటాయని చెప్పారు.ఈ నెల 15 నుండి ఫెయిల్/ఇంప్రూమెంట్ విద్యార్థులకు ఫీజులు కట్టించుకుంటామని చెప్పారు. కామర్స్,బోటనీ, జూవాలజీ,హిస్టరీ, ఫిజిక్స్, కెమిస్ట్రీలో 100% ఉత్తీర్ణత సాధించారని చెప్పారు.ఈ సందర్భంగా వారిని అభినందించారు.రీ వెరిఫికేషన్ కు ఈ నెల 13 నుండి 22 వరకు ఫీజులు కట్టించుకుంటామన్నారు.రీ వెరిఫికేషన్ కు ఒక సబ్జెక్టు కు రు 1300,రీ కౌంటింగ్ రు 260 కట్టాలన్నారు.

# ఏకగ్రీవమైన సిఐటియు మండల నాయకత్వ ఎన్నిక

## అధ్యక్షుడుగా కాంజేరి సెల్వరాజ్ మరియు కార్యదర్శిగా కొండ్రెడ్డి హరినాథ్

రేణిగుంట స్వర్ణ సాగరం ఏప్రిల్ 12




రేణిగుంట పుచ్చలపల్లి సుందరయ్య కార్యాలయం వద్ద శనివారం నాడు సిఐటియు మండల జనరల్ బాడీ మీటింగ్ పి.రాజశేఖర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు అంగేరి పుల్లయ్య ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అనంతరం రేణిగుంట సిఐటియు మండల కమిటీని 23 మందితో నూతనంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా కాంజేరి సెల్వరాజ్, ఉపాధ్యక్షులు గా కె. నాగూర్, టి. సుబ్రమణ్యం, ధనమ్మ, ప్రధాన కార్యదర్శిగా కొండ్రెడ్డి హరినాథ్, సహాయ కార్యదర్శిగా కృష్ణమూర్తి, పి. రాజశేఖర్, బి. తేజ, కోశాధికారిగా రామిరెడ్డి తో పాటు 9 మందిని కార్యదర్శి వర్గంను ఎన్నుకున్నారు. మండల కమిటీ సభ్యులుగా లక్ష్మీ, మునికృష్ణారెడ్డి, జయరామిరెడ్డి, కుమార్, మస్తాన్, హేమనాద్, శివ, నారాయణ, సుభాష్, కోటేశ్వరరావు, భాగ్యలక్ష్మి, పురుషోత్తం, మునిరాజా, ఈశ్వరమ్మ తో పాటు 14 మందిని కమిటీ సభ్యులను ఎన్నుకోవడం జరిగింది. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన సిఐటియు మండల కార్యదర్శి కొండ్రెడ్డి హరినాథ్ మాట్లాడుతూ మే డే స్ఫూర్తితో కార్మిక సోదరులు కలిసి రేణిగుంట మండలంలో పలుచోట్ల సిఐటియు ఎర్రజెండా రెపరెపలాడాలని పిలుపు ఇచ్చారు. మే 20వ తేదీన దేశవ్యాప్తగా కార్మికులు చేసే సార్వత్రిక సమ్మె సందర్భంగా రేణిగుంట మండల కేంద్రంలో ఉదయం 9 గంటలకే కార్మికులు కలిసి చేసే ప్రదర్శనలో నివాస ప్రాంతం కార్మికులు, వలస కూలీలు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయవలసిందిగా పిలుపు ఇచ్చారు. దేశంలో నిత్యవసర సరుకుల ధరలు పెరుగుదలకు అనుగుణంగా కార్మికులందరికీ కనీస వేతనం అమలు చేయాలని, 4 లేబర్ కోడ్లను వెంటనే రద్దు చేయాలని, నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పన కై ఎర్రజెండా సిఐటియు పోరాటాలు నడుపుతుందని తెలిపారు.

# ప్రభుత్వ పాఠశాల ప్లస్లో ఉత్తమ ఫలితాలు

**నాగలాపురం -స్వర్ణ సాగరం ఏప్రిల్ 12:**



ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం శనివారం ప్రకటించిన ఇంటర్మీడియట్ విద్యార్థుల ఫలితాలలో నాగులాపురం మండలం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్లస్ విద్యార్థులు విజయ డంకా మోగించారు.పాఠశాల నుంచి ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో ఎంపీసీ,బైపీసీ గ్రూపుల్లో 32 మంది విద్యార్థులు హాజరుకాగా 32 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు.అదే విధంగా ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరంలో మొత్తం 27 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాగా 25 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారని పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి.కస్తూరయ్య తెలిపారు. విద్యార్థులకు చక్కటి బోధన చేసి ఉత్తమ ఫలితాలను సాధించిన ఉపాధ్యాయులను విద్యార్థులను పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ డి అయ్యప్ప అభినందించారు.ఎంపీసీ గ్రూప్ ప్రథమ, ద్వితీయ సంవత్సరంలోనూ నూటికి నూరు శాతం ఉత్తీర్ణత,బైపీసీ గ్రూపు నందు ప్రథమ ద్వితీయ సంవత్సరాలలో కేవలం ఇద్దరు విద్యార్థులు మినహా మిగిలిన విద్యార్థులు అందరూ విజయం సాధించారు.ఇంటర్మీడియట్ ఫలితాలలో ద్వితీయ సంవత్సరం ఎంపీసీ చదువుతున్న ఎం.నాగజ్యోతి 956 మార్కులతో ప్రథమ స్థానంలో ఉత్తీర్ణత సాధించింది.అలాగే 900 మార్కులను దాటిన విద్యార్థులను ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులు ప్రత్యేకంగా అభినందించారు.

## గణనాథుని దర్శించుకున్న మాజీ కేంద్రమంత్రి పనబాక లక్ష్మి



**కాణిపాకం, ఏప్రిల్ 12 స్వర్ణ సాగరం**

గణనాథుని సేవలో మాజీ కేంద్రమంత్రి పనబాక లక్ష్మి. కాణిపాకం శ్రీ వరసిద్ది వినాయక స్వామివారి నీ దర్శించుకున్న టిటిడి బోర్డు సభ్యులు మరియు మాజీ కేంద్రమంత్రి పనబాక లక్ష్మి , స్వామివారిని దర్శించుకున్నారు, వీరికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేసి స్వామివారి తీర్థప్రసాదాలు అందజేసిన దేవస్థానం ఈ.వో పెంచల కిషోర్ , ఈ కార్యక్రమంలో ఏఈవోలు , ఎస్ వి కృష్ణారెడ్డి, ప్రసాద్, సూపర్డెంట్లు, తదితరులు ఉన్నారు.

## కాలభైరవుని కళ్యాణం





**స్వర్ణసాగరం బైరెడ్డిపల్లి ఏప్రిల్ 12:-**

చిత్తూరు జిల్లా బైరెడ్డిపల్లి మండల పరిధిలోని కుప్పనపల్లె గ్రామ శివారులలో వెలసిన శ్రీ భైరవి భైరవేశ్వర స్వామి వారికి చిత్ర పౌర్ణమి సందర్భంగా శనివారం స్వామివారికి ఉదయం అర్చకులు మురళీధర్ ఆచార్యులు పంచామృత అభిషేకములు జరిపి వివిధ రకాల పుష్పాలతో అలంకారం జరిపి భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు తర్వాత కాలభైరవ స్వామిఅమ్మవార్లకు పవన్ శాస్త్రి కంకణ ధారణ జిలకర బెల్లం మాంగల్య ధారణ జరిపి ముత్యాల తలంబ్రాలు వేసి స్వామివారికి అంగరంగ వైభవంగా కన్నుల పండుగగాకళ్యాణోత్సవం జరిపారు తరువాత దేవస్థానం చుట్టూ ప్రాకారోత్సవం . కార్యక్రమమునకు భాగ్యమ్మ రఘు గౌడు, అశోక్, వెంకటరెడ్డి, కృష్ణప్ప ,బైరప్ప, దినకరబాబు ,మోహన్ బాబు వ్యవహరించారు . గ్రామస్తులు కర్ణాటక నుండి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## నేడే 5వ తరగతి ఇంటర్ ప్రవేశ పరీక్షలు

**తోటపల్లి గూడూరు స్వర్ణసాగరం ఏప్రిల్ 12**

డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ గురుకులాల ద్వారా ఆదివారం 5 వ

తరగతి ఇంటర్ మొదటి సంవత్సరం ప్రవేశాలకు ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నారు. ఉదయం 5వ తరగతి మధ్యాహ్నం ఇంటర్ ప్రథమ సంవత్సరం ప్రవేశాలకు ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్లు కోడూరు గురుకుల కళాశాల ప్రిన్సిపాల్ ఎస్తేరమ్మ తెలిపారు

## లోకేష్ రాయల్ ని కలిసిన సినీ డైరెక్టర్ బీ లోకేష్



**ఐరాల ఏప్రిల్ 12 స్వర్ణసాగరం**

పాతపాలెం పంచాయతీ లోకేష్ రాయల్ ఆహ్వానం మేరకు కన్నడ సినీ డైరెక్టర్ బి లోకేష్ మర్యాదపూర్వకంగా కలిశారు. శనివారం ఐరాల మండలం పాతపాలెం పంచాయతీలో సర్పంచ్ లోకేష్ స్వగృహం నందు కన్నడ సినిమా డైరెక్టర్ బీ లోకేష్ మర్యాదపూర్వకంగా కలిశారు , ఈ కార్యక్రమంలో పాతపాలెం సర్పంచ్ లోకేష్ రాయల్ ,మరియు జనసేన పార్టీ రాయలసీమ జోరు ఎలక్షన్ క్యాంపింగ్ సభ్యులు పూల ప్రభాకర్, తెలుగుదేశం పార్టీ నాయకులు కాలువ గడ్డ ఎం .ప్రసాద్ , ఒంట్రి వారి పల్లి లోకయ్య, జనసేన పార్టీ యూత్ చందు, జ్యోతి , కలిసి దుశాలవతో ఘనంగా సన్మానించడం జరిగింది. లోకేష్ రాయల్ మాట్లాడుతూ మరెన్నో విజయాలు అందుకోవాలి శ్రీ వరసిద్ధి వినాయక స్వామి వారిని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్టు తెలియజేయటం జరిగింది.

## బైరెడ్డిపల్లి రోడ్డుపై ప్రమాదం



**స్వర్ణసాగరం బైరెడ్డిపల్లి ఏప్రిల్ 12:-**

చిత్తూరు జిల్లా బైరెడ్డిపల్లి గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓవ్యక్తి గాయపడిన ఘటన బైరెడ్డిపల్లి మండలం కమ్మనపల్లి వద్ద చోటుచేసుకుంది. స్థానిక బాలికల గురుకుల పాఠశాల సమీపంలో ఇల్లూరుకు చెందిన కొమ్మర జయపాల్ (50)అనే వ్యక్తిని గుర్తు తెలియని శనివారం సాయంత్రం వాహన ఢీ కొట్టింది. తీవ్రంగా గాయపడిన జయపాలు కుటుంబ సభ్యులు 108 సహాయంతో పలమనేరు ఏఎక్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## ఐరాల కైకలూరు నియోజకవర్గం ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ నీ సన్మానించిన ఐరాల చిట్టిబాబు



కార్యక్రమంలో బిజెపి నాయకులు

**కాణిపాకం ఏప్రిల్ 12 గరుడదాద్రి న్యూస్**

కామినేని శ్రీనివాస్ని ఘనంగా సన్మానించిన ఐరాల బిజెపి పార్టీ సీనియర్ నాయకులు చిట్టిబాబు. శనివారం కాణిపాకం కి విచ్చేసిన కృష్ణాజిల్లా కైకలూరు నియోజకవర్గం శాసనసభ్యులు , తిరుమల తిరుపతి దేవస్థానం బోర్డు సభ్యులు,కామినేని శ్రీనివాస్ నీ అతిథి గృహంలో ఐరాల మండలం బిజెపి సీనియర్ నాయకులు చిట్టిబాబు దుశ్యాలతో ఘనంగా సన్మానించారు, అనంతరం కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయక స్వామి వారి ప్రసాదం అందజేశారు, ఈ కార్యక్రమంలో జిల్లా నియోజకవర్గ మండల బిజెపి నాయకులు అభిమానులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## నిమ్న కులాలలై అగ్ర దాడులు ఆటవికం



**స్వర్ణ సాగరం -శ్రీకాళహస్తి**

స్వాతంత్రం సిద్ధించి 78 ఏళ్ళు దాటిపోతున్నా సమాజంలో ఇంకా నిమ్న కులాలపై అగ్ర కులాల వారు దాడులకు తెగబడుతుండటం ఆటవికమని కుల వివక్ష వ్యతిరేక పోరాట సమితి శ్రీకాళహస్తి డివిజన్ కార్యదర్శి రెడ్డిపల్లి సురేష్ ఆవేదన వ్యక్తం చేశారు. అగ్ర కులాల దాడిలో గాయపడి స్థానిక ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విరూపాక్షపురం గిరిజనులను శనివారం కేవీపీఎస్ నాయకులతో పాటు పలు ప్రజా సంఘాల నాయకులు పరామర్శించారు. దాడి జరిగిన తీరును అడిగితెలుసుకున్నారు. కేవలం తాము అగ్ర కులాల వారమన్న అహంతోనే గద్దగుంటకు చెందిన చైతన్య, అతడి తరపు బంధువులు వెంకటేష్ (35), నాగయ్య(60)లపై దాడి చేసినట్లు సురేష్ అన్నారు. ఈ దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామనీ, వెంటనే బాధ్యులపై అట్రాసిటీ కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అంగేరి పుల్లయ్య, పెనగడం గురవయ్య, గురునాథం, సంక్రాంతి వెంకటయ్య పాల్గొన్నారు.

## కాణిపాక స్వామి వారిని దర్శించుకున్న ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్

**కాణిపాకం ఏప్రిల్ 12 స్వర్ణ సాగరం**

గణనాథుని సేవలో కృష్ణాజిల్లా కైకలూరు నియోజకవర్గ శాసనసభ్యులు కామినేని శ్రీనివాస్. కాణిపాకం శ్రీ వరసిద్ది వినాయక స్వామివారి దర్శించుకున్న కృష్ణాజిల్లా కైకలూరు నియోజకవర్గ శాసనసభ్యులు కామినేని శ్రీనివాస్ , కుటుంబ సభ్యులతో స్వామివారిని దర్శించుకున్నారు, వీరికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేసి స్వామివారి తీర్థప్రసాదాలు అందజేసిన దేవస్థానం ఈ.వో పెంచల కిషోర్ , ఈ కార్యక్రమంలో ఏఈవోలు .కృష్ణారెడ్డి, ప్రసాద్, హరి మాధవరెడ్డి, సూపర్డెంట్లు కోదండపాణి, వాసు, టెంపుల్ ఇన్స్పెక్టర్ బాలాజీ నాయుడు, స్థానిక నాయకులు, తదితరులు ఉన్నారు.

## గణనాథుని సేవలో కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి రాజేష్ రాయ్



స్వామి వారి చిత్రపటం అందజేస్తున్న ఆలయ ఈవో పెంచల కిషోర్

**కాణిపాకం, ఏప్రిల్ 12 స్వర్ణ సాగరం**

కాణిపాక స్వామి వారిని దర్శించుకున్న కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి రాజేష్ రాయ్. కాణిపాకం శ్రీ వరసిద్ది వినాయక స్వామివారి దర్శించుకున్న కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శ్రీ రాజేష్ రాయ్ , స్వామివారిని దర్శించుకున్నారు, వీరికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేసి స్వామివారి తీర్థప్రసాదాలు అందజేసిన దేవస్థానం ఈ.వో పెంచల కిషోర్ , ఆలయ సూపర్డెంట్ వాసు, టెంపుల్ ఇన్స్పెక్టర్ రవి, సి.ఐ శ్రీధర్ నాయుడు, చిత్తూరు కోర్టు సిబ్బంది, తదితరులు ఉన్నారు.

## స్వామి వారి నిత్య అన్నదానం ట్రస్ట్ కి విరాళం

### ఆలయ ఈవో పెంచల కిషోర్ కి విరాళం అందజేస్తున్న దాతలు



**కాణిపాకం ,ఏప్రిల్ 12 స్వర్ణ సాగరం**

కాణిపాకం స్వామివారి అన్నదానం కి విరాళం .కాణిపాకం శ్రీ వరసిద్ది వినాయక స్వామి వారి దేవస్థానం నిత్య అన్నదానం ట్రస్ట్ విరాళం – 1,05,000 రూపాయలు, దాత శివప్రసాద్ , వారి కుటుంబ సభ్యులు విజయనగరం వాస్తవ్యులు, వీరికి దర్శన ఏర్పాట్లు చేసి తీర్థప్రసాదాలు అందజేసి దేవస్థానం ఈ.ఓ పెంచల కిషోర్ , ఉన్నారు.

# టూ టౌన్ పోలీస్ స్టేషన్ వద్ద చలివేంద్రం ఏర్పాటు చేసిన సీఐ - వెంకటేశులు



స్వర్ణ సాగరం -శ్రీకాళహస్తి

జిల్లా ఎస్పీ శ్రీ హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు శనివారం టూ టౌన్ పోలీస్ స్టేషన్ వద్ద పాదాచారులకు , ఈ మార్గంలో వెళ్లే వారికి పలు రకాల సమస్యల మీద పోలీస్ స్టేషన్ కు వచ్చే వారికి చల్లని మంచినీటిని అందించాలన్న ఉద్దేశంతో చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు టూ టౌన్ సిఐ వెంకటేశులు తెలిపారు.. నేడు వేసవి తాపం ఎక్కువగా ఉండడంతో పక్షులు కూడా నీటి కోసం అల్లాడుతున్నాయని వాటి దాహార్తిని తీర్చేందుకు కూడా చర్యలు చేపట్టామన్నారు. పక్షుల దాహార్తిని తీర్చేందుకు పోలీస్ స్టేషన్ పైన ఇతర ప్రాంతాల్లో మూకల ద్వారా పక్షులకు నీళ్ల నిర్వహించేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. వేసవికాలం పూర్తి అయ్యేవరకు చలివేంద్రం ఉంటుందని సిఐ పేర్కొన్నారు. అనంతరం ఈ మార్గంలో వెళ్లే మహిళలు చిన్నారులకు ఆటో డ్రైవర్లకు చల్లని నీటితో పాటు మజ్జిగను కూడా పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీఐతో పాటు ఏఎస్ఐ షణ్ముగం, కానిస్టేబుల్ కిషోర్ మరియు టూ టౌన్ పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

# హిందూ ధర్మ రక్షణకు ఇంటికో బిడ్డనివ్వండి





స్వర్ణ సాగరం- శ్రీకాళహస్తి

శ్రీకాళహస్తి సుఖ బ్రహ్మ ఆశ్రమంలో ఆశ్రమ వార్షికోత్సవం వైభవంగా నిర్వహించారు. ఆశ్రమ పీఠాధిపతి శ్రీ విద్యా స్వరూపానందగిరి స్వామి ఆధ్వర్యంలో ఆశ్రమ వార్షికోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు.. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన ఆధ్యాత్మిక సభలో శ్రీ వశిష్టాశ్రమ పిఠాధిపతులు శ్రీ స్వ స్వరూపానందగిరి స్వామి ప్రసంగిస్తూ ప్రస్తుత పరిస్థితుల్లో సెల్ఫోన్ మాయలో చిన్నారుల భవిష్యత్తు అంధకారంలో పడిపోతుందని, ఈ మురికి కూపం నుంచి బయట కు రావడానికి ఆశ్రమాల్లో నైతిక విలువలతో కూడిన విద్యను అందించాలన్నారు. హిందూ ధర్మ రక్షణకు ప్రతి కుటుంబం ఒక బిడ్డను ఇవ్వాలన్నారు. గృహస్థాశ్రమం నుంచి బిడ్డలు రాకపోతే హిందూ ధర్మం పరిరక్షణ మనుగడ ఏరా సాధ్యమన్నారు. ప్రతి కుటుంబం ఒక బిడ్డను ఇంటికి, ఒక బిడ్డను దేశానికి, మరొక బిడ్డను హిందూ ధర్మ పరిరక్షణకు ఇవ్వాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. జనాభా పెరుగుదల ఆవశ్యకతను ప్రభుత్వాలు గుర్తించి బిడ్డల కన్నడం పై ఉన్న ఆంక్షలు ఎత్తివేసారని గుర్తు చేశారు.

# శివయ్య సన్నిధిలో రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కుమారస్వామి యాదవ్



స్వర్ణ సాగరం- శ్రీకాళహస్తి

దక్షిణ కాశి శ్రీకాళహస్తీశ్వర ఆలయంలో కుటుంబ సభ్యులతో విచ్చేసి స్వామి అమ్మవాలను దర్శించుకున్న సాంకేతిక రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కుమార్ స్వామి యాదవ్ కుటుంబ సభ్యులతో విచ్చేశారు. వారికి దక్షిణ గోపురం వద్ద శ్రీకాళహస్తి సాంకేతిక వర్కింగ్ అధికారి వెంకీపురంవేణు, సిబ్బంది స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేపట్టారు. అనంతరం మృత్యుంజయ స్వామి సన్నిధానం వద్ద వేద పండితుల ఆశీర్వచనం తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది బాలయ్య, గిరీష్ ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# గోవులపై వైసిపి విష రాజకీయమా...?

**టిటిడి ప్రతిష్టకు భంగం కలిగిస్తే సహించేది లేదు**

**హిందువుల మనోభావాలు దెబ్బతీయడం కోసమే**

**గోవులు మృతి చెందాయంటూ వైసిపి ప్రచారం**

**సంపూర్ణ ఆరోగ్యంతో టీటీడీ గోశాలల్లో గోవులు**

**టిటిడి పర్యవేక్షణలో 260 మందితో గోసంరక్షణ**

**టీటీడీ పై తప్పుడు ప్రచారాలు మానుకోవాలి**

**విష ప్రచారంపై విచారణ జరిపి చర్యలు చేపట్టాలి**

**ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు వెల్లడి**

పర్చూరు స్వర్ణ సాగరం, ఏప్రిల్ 12:



పవిత్రమైన తిరుమల తిరుపతి దేవస్థానంలో గోవులపై వైసిపి విష రాజకీయానికి తెరలేపి రాక్షస ఆనందం పొందుతూ మతవిద్వేషాలు రెచ్చగొట్టే కుట్రకు వైసీపీ నేతలు పాల్పడుతున్నారని తెలుగుదేశం పార్టీ బాపట్ల పార్లమెంట్ మాజీ అధ్యక్షులు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు విమర్శించారు.టీటీడీ గోవులు మరణించాయంటూ వైసీపీ నేత భూమన కరుణాకరరెడ్డి అసత్య ప్రచారం పై ఎమ్మెల్యే ఏలూరి ఖండించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ నేత భూమన కరుణాకరరెడ్డి వ్యాఖ్యలు ప్రపంచవ్యాప్తంగా ఉన్న కోట్లాదిమంది ప్రజల మనోభావాలు దెబ్బతీసేలా టీటీడీపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. మత విద్వేషాలు రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నారని ధ్వజమెత్తారు. 'అదో నల్లరాయి.. దాని మీదకు చెప్పు విసిరితే ఏమవుతుందంటూ' గతంలో వెంకటేశ్వరస్వామిపై అనేక విమర్శలు చేసిన కరుణాకర్ రెడ్డి మరోసారి దుష్ప్రచారానికి తెరలేపారని ఎమ్మెల్యే ఏలూరి పేర్కొన్నారు.అలజడి సృష్టించేందుకు, ప్రశాంతతకు భంగం కలిగించేందుకు టీటీడీపై రోజుకో తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు. కోటిమంది దేవతలతో సమానంగా భావించే గోమాతలపై కూడా అసత్య ప్రచారం చేస్తూ టీటీడీ ప్రతిష్టకు భంగం కలిగించేందుకు కుట్రలు చేయడం దుర్మార్గం అన్నారు.

**గోమరణాలపై తప్పుడు ప్రచారం....**గోశాలలో 100 ఆవులు చనిపోయాయంటూ నేడు కరుణాకర్ రెడ్డి చేసిన ఆరోపణలు పూర్తి అవాస్తవం అన్నారు. గోశాలలోని ఆవులు వృద్ధాప్యం, డెలివరీ సమయంలో వ్యాధులతో నెలకు సగటున 10 ఆవుల వరకు మృత్యువాత పడుతుంటాయన్నారు.ఇవి గత అయిదేళ్ల గణాంకాలు చూస్తే స్పష్టమవుతుందన్నారు. గడిచిన మూడు నెలల్లో వృద్ధాప్యం, వ్యాధులు వంటి కారణాలతో ఇప్పటివరకు 40 ఆవులు మృత్యువాత పడడం జరిగిందన్నారు. కానీ కరుణాకర రెడ్డి ప్రెస్ మీట్ లో చనిపోయినట్లు చూపించిన ఆవుల ఫోటోలు ఇక్కడివి కాదు, ఎక్కడివో.. వాటిని అడ్డుపెట్టుకుని టీటీడీ పై తప్పుడు ప్రచారం చేస్తున్నారని పేర్కొన్నారు.

**టీటీడీ పర్యవేక్షణపై తప్పుడు ప్రచారం...**గోసంరక్షణ శాలపై తిరుమల తిరుపతి దేవస్థానం ప్రత్యేక దృష్టి పెట్టడంతోపాటు గోవుల సంరక్షణకు తీసుకుంటున్న చర్యలపై క్రమం తప్పకుండా సమీక్షించడం జరుగుతుందన్నారు.

టీటీడీ గోశాలలో 260 మందికి పైగా ఉద్యోగులు పనిచేస్తూ గోవుల సంరక్షణను సక్రమంగా చూసుకుంటుంటే టీటీడీ పట్టించుకోవడం లేదని తప్పుడు ప్రచారం చేయడం తగదన్నారు.

**జియో ట్యాగింగ్ పై, మరణాలపై అబద్ధాలు....**గోశాలలోని 2,668 ఆవులకు జియో ట్యాగ్ చేసి ప్రతిరోజూ పర్యవేక్షించడం జరుగుతుంటే ఆవులకు జియోట్యాగ్ తీసేశారంటూ విష ప్రచారం చేస్తున్నారని ఇది సరికాదన్నారు. గోశాలను గత ప్రభుత్వ హయాంతో పోల్చుకుంటే ఇప్పుడు అధునాతన సదుపాయాలు ఏర్పాటు చేయడంతో పాటు ప్రతిరోజూ గోశాలలను శుభ్రపరచడం, బ్లీచింగ్ చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. గోశాలను సందర్శించిన భక్తులు సైతం సంతృప్తి వ్యక్తం చేస్తుంటే ఇక్కడ పరిశుభ్రత లేదంటూ తప్పుడు ప్రచారం చేయడం ఏమిటని ప్రశ్నించారు.చనిపోయిన ఆవులకు పోస్టుమార్టం చేయడం లేదు.. అంటూ అర్థరహిత విమర్శలు చేస్తున్నారు.సహజ మరణం పొందిన ఆవులకు పోస్టుమార్టం చేయడం ఏ ప్రభుత్వ హయాంలోనూ జరగడం లేదన్నారు. ఏదైనా ప్రమాదంతో గానీ, అనుమానాస్పదంతో జరిగితే తప్పనిసరిగా పోస్టుమార్టం చేయడం జరుగుతుందన్నారు.

**రికార్డులు లేవంటూ తప్పుడు ప్రచారం...**జనన,మరణాల రిజిష్టర్ ను గోసంరక్షణ శాలలో ప్రతిరోజూ క్రమం తప్పకుండా నమోదు చేస్తున్న విషయం తెలిసి కూడా దురుద్దేశపూర్వకంగా రిజిస్టరులో నమోదు చేయడం లేదంటూ వ్యవస్థపై తప్పుడు ప్రచారం చేస్తున్నారు. లేగదూడలను పసిబిడ్డలుగా భావిస్తూ గోశాల సిబ్బంది సేవలందిస్తున్నారని ఎమ్మెల్యే ఏలూరి పేర్కొన్నారు.

**నాస్తికుడు కరుణాకర్ రెడ్డి....**నేను నాస్టికుడినని స్వయంగా కరుణాకరరెడ్డి ప్రకటించుకున్న విషయం వాస్తవం కాదా అని ప్రశ్నించారు. వెంకటేశ్వరస్వామిదేముంది.. ఒక నల్ల రాయి.. దానిని పెకిలించేస్తానంటూ గతంలో ప్రకటించలేదా అని ఎమ్మెల్యే ఏలూరి పేర్కొన్నారు. కరుణాకర్ రెడ్డి టీటీడీ ఛైర్మన్ గా పనిచేసిన సమయంలో ప్లాస్మా టీవీల కుంభకోణం, తాళిబొట్ల కుంభకోణం, టిక్కెట్లు అమ్ముకోవడం, డాలర్లు మాయం చేయడం వంటి దుశ్చర్యలకు పాల్పడలేదా...అన్నారు. కోవిడ్ సమయంలో స్వామి వారి ప్రసాదాలను కూడా దారిమళ్లించి అపచారాలకు పాల్పడిన చరిత్ర కరుణాకరరెడ్డిది కాదా? అన్నారు. కరుణాకరరెడ్డి కుమార్తె నీహారెడ్డి పెళ్లిని క్రైస్తవ మత ఆచారాలతో చేసిన మాట వాస్తవం కాదా?, కరుణాకరరెడ్డి అవినీతి, అక్రమాలతో టీటీడీ ఖజానాను దారిమళ్ళించి కమిషన్లు కొట్టేశారని మండిపడ్డారు.తిరుపతి కొండపై అన్యమత ప్రచారాన్ని ప్రోత్సహించింది, ఏడుకొండలను 5 కొడలుగా మార్చి కుట్ర చేసింది, టీటీడీని కూడా ప్రైవేట్ లిమిటెడ్ గా మార్చే చర్యలకు పాల్పడింది నువ్వు కాదా? అన్నారు. చేసిన తప్పుడు పనులకు విధుల దూరం అయిన హరనాథ్ రెడ్డి అనే వ్యక్తి కోసం టీటీడీ పై తప్పుడు ప్రచారాలు చేస్తారా? అని ప్రశ్నించారు. మత విద్వేషాలు రెచ్చగొడుతున్నందుకు, టీటీడీ ప్రతిష్టకు భంగం కలిగించేలా అసత్య ఆరోపణలు చేస్తున్నందుకు చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు.

# ఇంటర్మీడియట్ పరీక్ష ఫలితాల్లో రాయలసీమ కాలేజ్ విజయ డంకా

స్వర్ణ సాగరం- శ్రీకాళహస్తి

శ్రీకాళహస్తి ఏప్రిల్ 12 శ్రీకాళహస్తి నియోజకవర్గం 2024–25 సంవత్సరం మార్చిలో జరిగిన ఇంటర్మీడియట్ ఎగ్జామ్స్ ఫలితాల్లో రాయలసీమ కాలేజ్ విద్యార్థులు విజయ డంకా మోగించారు. శనివారం వదిలిన ఇంటర్మీడియట్ పరీక్ష ఫలితాలలో ప్రథమ సంవత్సరంలో ఎంపీసీ గ్రూప్ నందు 470 మార్కులు గాను జిఎం వంశీక 464, కే విష్ణు ప్రియ 460, బైబీసీ గ్రూప్ లో 440 మార్కులకు గాను బి షారోన్ ప్రియ 428, ఎస్.కె భూస్మ్యాసిన్ 415, సీఈసీ గ్రూప్ నందు 500 మార్కులకు గాను డి గణేష్ 477, పి నిషిత ఆమన్ 476, అలాగే రెండవ సంవత్సరం లో ఫలితాల్లో1000 మార్కులకు గాను ఎంపీ సి గ్రూప్ ఎస్.కె అమరన్ 979, బి శ్రీను 978, పి గగన 977,పి జాహ్నవి974, ఎం సాహిత్ 971, బై. బీ.సీ గ్రూప్ నందు 1000మార్కులకు గాని 969,951,949, సి ఈ సి గ్రూపు నందు 1000 మార్కులకు గాను జి నాగేశ్వరి 964, రేవతి 955, మార్కులతో విజయ డంక మోగించారు. అన్ని గ్రూపుల నందు జూనియర్ ఇంటర్ 400 మార్కులు పైగా సాధించినమా విద్యార్థులు 40 మంది, సెకండ్ ఇయర్ లో 900 మార్కులు పైగా సాధించిన మా విద్యార్థులు 60 మంది, రాయలసీమ కాలేజీలో రాష్ట్ర స్థాయి మార్కులు సాధించిన విద్యార్థులకు కళాశాల డైరెక్టర్ ఎస్. సుబ్బరామిరెడ్డి, వారి సిబ్బంది కలిసి ఇంటర్మీడియట్ పరీక్ష ఫలితాల్లో సాధించిన విద్యార్థులకు అభినందనలు తెలియజేశారు.













# ప్రభంజనం ఇంటర్ ఫలితాల్లో శ్రీ వేమ విద్యార్థుల ప్రభంజనం.

నాయుడుపేట.

రాష్ట్ర ప్రభుత్వం శనివారం విడుదల చేసిన ఇంటర్మీడియట్ ఫలితాల్లో నాయుడుపేట పట్టణంలోని శ్రీ వేమ జూనియర్ కళాశాల విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించి ప్రభంజనం సృష్టించారు. ఈ సందర్భంగా శ్రీ వేమ జూనియర్ కళాశాలలో జరిగిన విలేకరుల సమావేశంలో కళాశాల డైరెక్టర్ పి శ్రీనివాసులు రెడ్డి మాట్లాడారు. శ్రీ వేమా జూనియర్ కళాశాల స్థాపించిన 31 సంవత్సరాలుగా తమ కళాశాల విద్యార్థులు స్టాండర్డ్ ఫలితాలను సాధిస్తూ చరిత్ర సృష్టిస్తున్నారని తెలియజేశారు. 31 సంవత్సరాల్లో తమ కళాశాలలో చదివిన అనేక మంది విద్యార్థులు ఉన్నత చదువులు చదివి ఉద్యోగాల్లో రాణిస్తున్నారని తెలియజేశారు. ఉత్తమ ఫలితాలకు,అత్యుత్తమ శిక్షణకు శ్రీ వేమ జూనియర్ కళాశాల ల్యాండ్ మార్క్ అయిందన్నారు. క్రమశిక్షణతో, సాంకేతిక పరిజ్ఞానంతో విద్యను అందించడం ద్వారా తమ విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నారని తెలియజేశారు. నేడు విడుదలైన ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం ఎంపీసీ గ్రూపులో ఎం జస్వంత్ 982 మార్కులు, కే శ్రావణ్ కుమార్ రెడ్డి 982, కే సాయి హాసిని 981, కే తనిష్క 980, కే స్వప్న 975, పి రోహిణి 974, జి భాగ్యశ్రీ 973, పి చరణ్ తేజ 973, ఎస్ తనుజ 972, బి లక్ష్మీ ప్రసూన 971, పి యమునా యశస్వినీ 971, పి వర్ష 971, ఎం చంద్రపియా 971, పి చరణ్ తేజ 969, ఎంపీ దాత్రి శ్రీ 963, డి ముఖేష్ 963, ఇ మధుమతి 961, ఆర్ యోగానంద్ కార్తీక్ 959, యు ముని చైతన్య 958, కే యశ్వంత్ 957, కే లికిత 956, జి ధరణి కుమార్ 952, ఇ లేఖ శ్రీ 952, ఎస్ చంద్రిక 952, ఎం శైలజ 950 మార్కులు సాధించారని తెలియజేశారు. బైపీసీ గ్రూపులో కె నందితా చౌదరి 961 మార్కులు, పి తేజ చరణ్ 931, ఎం శాంభవి 930 మార్కులు సాధించినట్లు తెలిపారు. సీఈసీ గ్రూపులో జి అరుణ 795 మార్కులు, ఎం వర్షిత 784, పి శివకుమార్ 765 మార్కులు సాధించారన్నారు. ఫస్ట్ ఇయర్ ఎంపీసీ గ్రూపులో వి శ్రీ హాసిని 465 మార్కులు, వి నేహా శ్రీ 465, వి శ్రీహర్షిణి 463, బి తేష్ణశ్రీ 461, వై కీర్తన 461, సిహెచ్ సుప్రియ 461, ఆర్ సిరి 460, టి ముని పుష్యంత్ 460, ఎస్ అఖిల 459, కే అక్షయ 459, ఎస్ నాగశ్రీ చరిత 458, టి అక్షయ 458, వై హేమ తేజ 458, బి సాయి శ్రావణి 457, టీ గురు శృతి 456, ఏ వేణు 456, బి మౌనిష్ 455, బి శ్రేయ 455, ఎం ముని రాజా 455, ఏ ముని తనుజ 455, కే జాహ్నవి 453, జి మహిత 451, కే పద్మజ 450, పి గురు సృజన్ 445, బి రుషిత 445, ఓ హిమబిందు 442, ఎస్ కారుణ్య హాసిని 441, ఎస్ వి ఎల్ మౌనిక 441 మార్కులు సాధించారని తెలియజేశారు. అలాగే బైపిసి గ్రూపులో షేక్ అజ్రా అంజుమ్ 419 మార్కులు సాధించారని తెలిపారు. ఎం ఇ సి గ్రూపులో టి ఐశ్వర్య 455 మార్కులు సాధించారన్నారు. సీఈసీ గ్రూపులో మునిగంగాధర్ 450 మార్కులతో ఉత్తమ ఫలితాలు సాధించారని తెలియజేశారు. అనంతరం ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థిని విద్యార్థులను అభినందించారు. తమ కళాశాల విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించేందుకు కృషి చేసిన అధ్యాపకులకు అభినందనలు తెలియజేశారు.

